తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
13 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :

# అధిక బొగ్గు ఉత్పత్తికి సవరించిన లక్ష్యాల మేరకు ఓబీ తొలగించాలి..

## - రోజుకి ఆఫ్ లోడింగ్ ద్వారా 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపే లక్ష్యం..

## - అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి దిశానిర్దేశం..




గోదావరిఖని, జనంసాక్షి : రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందించాల్సి ఉన్నందున దీని కోసం సవరించిన ఓవర్ బర్డెన్ లక్ష్యాలను రోజువారీగా సాధించాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఆయన సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తవ్వి తీసే పనులు నిర్వహిస్తున్న 19 ఆఫ్ లోడింగ్ సంస్థల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు అమలు జరుపుతోందని, దీనికి అనుగుణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో సవరించిన ఓబీ తొలగింపు లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఆగస్టు నెల వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించే లక్ష్యాన్ని నిర్దేశించగా 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించడం జరిగిందన్నారు. అయితే మొత్తం 19 ఆఫ్ లోడింగ్ సంస్థల్లో ఆగస్టు నెలాఖరు వరకు 8 ఆఫ్ లోడింగ్ సంస్థల వారు మాత్రమే 100 శాతం ఓవర్ బర్డెన్ లక్ష్యాలు సాధించారని, మిగిలిన వారు లక్ష్యాలు సాధిస్తూ సహకరించాలన్నారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యం 7.28 లక్షల క్యూబిక్ మీటర్లుగా భావించినప్పటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్ కు అనుగుణంగా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించామని దీనికి అనుగుణంగా లక్ష్యాలు సాధించాలని కోరారు.

ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలు ఖచ్చితంగా సాధించాలని ఆదేశించారు. జెవిఆర్ ఓసి, మణుగూరు ఓసి, జిడికె ఓసి, ఆర్జి ఓసి-3, ఆర్జి ఓసి-2, కెటికె ఓసి-2, శ్రీరాంపూర్ ఓ.సీలలో ఓబీ తొలగిస్తున్న కొన్ని ఆఫ్ లోడింగ్ సంస్థల వారు లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నారని, వెనుకబడిన లక్ష్యాల సాధనతో పాటు తాజాగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతీ ఆఫ్ లోడింగ్ సంస్థ ఎన్ని షవల్స్, ఎన్ని డంపర్లు వాడుతున్నాయి? లక్ష్యాల సాధనకు ఎన్ని వాడాల్సి ఉంది? అనే విషయాన్ని కూడా లోతుగా సమీక్షించారు. ఇంకా కొత్త ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్ లోడింగ్ టెండర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సంస్థ సీఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# రామగుండానికి పారిశ్రామిక పునర్వైభవం తీసుకురావాలి..

## - 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి..

## - అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్..



గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతిపై మాట్లాడిన ఆయన రామగుండం ప్రాంతంలో అందుబాటులో ఉన్న అపారమైన వనరులను సద్వినియోగం చేసుకుని భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఐటీ సెంటర్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఎమ్మెల్యే స్వాగతించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఐటీ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూ, ఇందుకు కృషి చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రామగుండం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఎల్లంపల్లి నీరు, విద్యుత్, ఎన్‌టీపీసీ, బొగ్గు వంటి కీలక వనరులు అందుబాటులో ఉండటంతో పాటు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన మౌలిక వసతులు కూడా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి అనేక సౌకర్యాలు ఒకే ప్రాంతంలో ఉండటం రామగుండం ప్రత్యేకత అని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జెన్‌కోకు చెందిన భూములతో పాటు రైతుల భూములను కలుపుకుని సుమారు 1,800 ఎకరాల భూమిని సేకరించినప్పటికీ, అక్కడ పరిశ్రమ ఏర్పాటు కాలేదని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ భూములను, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని కొత్త భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రామగుండంలో 1.800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని అసెంబ్లీ వేదికగా రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. ఈ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత ఊపందుకోవడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో రామగుండం ప్రాంతం మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందిందని రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో రామగుండాన్ని అభివృద్ధి చేసి, కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రామగుండం ప్రాంతానికి ఉన్న సహజ వనరులు, నీరు, విద్యుత్, బొగ్గు, పారిశ్రామిక మౌలిక వసతులను సమర్థంగా వినియోగించుకుని భారీ పరిశ్రమలను తీసుకురావడం ద్వారా పెద్దపల్లి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు.

# క్రీడలతో ఆరోగ్యం, ఉత్సాహం ఉన్నత స్థాయికి ఎదగాలి

## లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం..



గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రామగుండం ఏరియా-1 పరిధిలో ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న అంతర్గత డబ్ల్యుపీఎస్ అండ్ జీఏ 2026-27 క్రీడా పోటీల్లో భాగంగా లాన్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కమిషనరేట్ కార్యాలయం వద్ద ఉన్న లాన్ టెన్నిస్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఏసిపి (ఏఆర్) సి.ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.ప్రతాప్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధి నిర్వహణతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ ఏదో ఒక క్రీడలో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని తెలిపారు. క్రీడల వల్ల లాభమే తప్ప నష్టం లేదని, ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల మధ్య క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు డబ్ల్యుపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పూర్తి ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, ఉత్తమ ప్రదర్శన కనబరిచి కోల్ ఇండియా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికై సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు..

డబ్ల్యుపిఎస్ అండ్ జిఏ 2026-27 క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న లాన్ టెన్నిస్ పోటీల్లో ఆర్జీ-1 ఏరియా పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు

# జీజీహెచ్ గోదావరిఖనిలో అరుదైన శస్త్రచికిత్స..

## రోడ్డు ప్రమాద బాధితుడికి పునర్జన్మ..




గోదావరిఖని, జనంసాక్షి : తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురై, ముఖం, దవడ ఎముకలు పూర్తిగా విరిగిపోయిన ఒక పేద బాధితుడికి రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్) వైద్యులు అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుండి కాపాడారు. ఘటన అండ్ శస్త్రచికిత్స వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ సమీపంలోని కనగర్తికి చెందిన సదానందం అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో 'లీఫోర్ట్ 3 ఫ్రాక్చర్-బైలాటరల్' (ముఖం, దవడ ఎముకలు తీవ్రంగా విరిగిపోవడం) గురయ్యారు. ప్రైవేట్ వైద్యం చేయించు కోలేని ఆర్థిక పరిస్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు జిజిహెచ్ గోదావరిఖనికి తీసుకువచ్చారు. సాధారణ పద్ధతిలో శ్వాస ట్యూబ్ వేయడం అసాధ్యం కావడంతో, అనెస్థీషియా, డెంటల్ వైద్యులు అత్యంత నైపుణ్యంతో 'సబ్‌మెంటల్ ఇంట్యూబేషన్' అనే అరుదైన విధానం ద్వారా గడ్డం కింద నుండి ట్యూబ్ అమర్చారు. అనంతరం నాణ్యమైన ఇంప్లాంట్స్‌తో ముఖ భాగాన్ని క్షుణ్ణంగా రీ-కన్‌స్ట్రక్షన్ (పునర్నిర్మాణం) చేసి, రెండు వైపులా ఎముకలను విజయవంతంగా ఫిక్స్ చేశారు.

**వైద్య బృందం:** డెంటిస్ట్రీ విభాగం డాక్టర్ సుమలత (హెచ్ఓడి), డాక్టర్ శ్రవణ్‌తేజ (మాక్సిల్లోఫేషియల్ సర్జన్), డాక్టర్ లహరి, డాక్టర్ నైనా అనెస్థీషియా విభాగం డాక్టర్ భానులక్ష్మి (హెచ్ఓడి), డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ కరుణాకర్. గత 3 ఏళ్లలో డెంటల్ విభాగం ప్రతిభ గత రెండున్నర-మూడేళ్లలో జిజిహెచ్ డెంటిస్ట్రీ విభాగం అద్భుతమైన సేవలు అందించింది. మన రాష్ట్రంలోనే అత్యధికంగా 'మాక్సిల్లోఫేషియల్ ట్రౌమా' (ముఖం/దవడ గాయాల) కేసులను చికిత్స చేస్తున్న ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రుల్లో జిజిహెచ్ గోదావరిఖని ఒకటిగా నిలిచింది. ఇక్కడ అత్యంత క్లిష్టమైన ట్రౌమా కేసులే కాకుండా: మాక్సిల్లోఫేషియల్ పాథాలజీ కేసులు అండ్ క్లిష్టమైన సిస్ట్‌లకు చికిత్స ఓరల్ క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ (డయాగ్నోసిస్) టొబాకో సెసేషన్ (పొగాకు మానెయ్యడానికి కౌన్సెలింగ్) ప్రోగ్రామ్‌లు అన్ని రకాల జనరల్ డెంటల్ చికిత్సలను విజయవంతంగా అందిస్తున్నారు. సూపరింటెండెంట్ అభినందనలు అండ్ కుటుంబ సభ్యుల సంతోషం: ప్రస్తుతం పేషెంట్ పూర్తి క్షేమంగా ఉన్నారు. ఉచితంగా నాణ్యమైన ఇంప్లాంట్స్‌తో వైద్యం అందించినందుకు బాధితుడి కుటుంబ సభ్యులు కంటినిండా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతం చేసిన డాక్టర్ల టీమ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందుసింగ్, ఆర్ఎంఓ డాక్టర్ కృపాబాయి ప్రత్యేకంగా అభినందించారు.

## కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:**వినాయక చవితి పండుగ ను పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మట్టి గణేష్ విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని నిజామాబాదు జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడిస్ భుజంగరావు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ సబ్ కలెక్టర్ కార్యాలయం లో ప్రారంభించారు .ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఎర్పాటు చేసుకోని పర్యావరణాన్నీ కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అడిషనల్ కలెక్టర్ అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగాంగ 8 అంగుళాల మట్టి గణపతి లను ఉచితంగా అందించి పర్యావరణం పై పెద్ద ఎత్తున అహగహన కార్యక్రమాలు టి జి పి సి బి నిర్వహంచడం జరిగిందని పర్యావరణ ఇంజనీర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ రవిదాస్,జూనియర్ అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి



**గంభీరావుపేట సెప్టెంబర్ 12 జనం సాక్షి;**గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని డీఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ ఓదెల వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్ సూచించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో గణపతి మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. గణపతి నిమజ్జనం సమయంలోనూ పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరారు.ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. సమావేశంలో మండలంలోని వివిధ గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**సదాశివనగర్ సెప్టెంబర్12 (జనంసాక్షి):** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు ఇటీవల పదవీ విరమణ పొందిన రామారెడ్డి ఎంఈఓ ఆనంద్‌రావును శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో ఘనంగా సన్మానించారు. చత్రపతి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లోకోటి కృష్ణారావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హన్మాంతోల్ల బాలకిషన్, గడ్డమీద అశోక్‌రావు, కే. బల్వంత్‌రావు, కరుణ, కీర్తిమాలిని, ప్రణీతతో పాటు రైల్వే బోర్డు సభ్యుడు జనార్దన్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి చేస్తున్న సేవలను సొసైటీ సభ్యులు కొనియాడారు.అలాగే విద్యారంగంలో సేవలందించి ఇటీవల పదవీ విరమణ పొందిన రామారెడ్డి ఎంఈఓ ఆనంద్‌రావును సన్మానించి ఆయన సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో చత్రపతి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:**హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి మల్లికార్జున్,పిలుపునిచ్చారు.శుక్రవారం నిజామాబాద్ నగరంలోని దుబ్బ ఏరియా లో కె,ఉదయ ట్రేడర్స్ పసుపు డోల్ లో పనిచేస్తున్న హమాలి కార్మికుల ఆధ్వర్యంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, గోదాములు,రైస్ మిల్లులు,సిమెంటు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు,ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వేలాది మంది హమాలీ కార్మికులు నేటికీ చట్టబద్ధమైన హక్కులు,రక్షణ లేకుండా పనిచేస్తున్నారని అన్నారు.హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రభుత్వం హమాలీలకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చట్టబద్ధమైన హక్కులు ,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు .హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 50 సంవత్సరాల వయసు దాటిన హమాలీలకు నెలకు 10వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ,ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, సంజు, లలిత, శంకర్, లక్ష్మి, సుమన్ బాయ్, గంగుబాయి, రాజు, లక్ష్మణ్, గంగాధర్, ఈశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:**రాష్ట్రంలోని యూనివర్సిటీలు తీవ్ర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా, వాటి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించకపోవడం దుర్మార్గమని పి డి ఎస్ యు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ లో తే.యూ పి డి ఎస్ యూ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హాజరైన పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత, నిధుల కొరత, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల లేమి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కొరత వంటి అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం యూనివర్సిటీల సమస్యలను పట్టించుకోకుండా అసెంబ్లీలో చర్చించకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోందని విమర్శించారు.యూనివర్సిటీల సమస్యల పై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ చేపట్టి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయకపోవటం వలన పేద మధ్య తరగతి విద్యార్థులు పైచదువులకు దూరమవుతున్నారని వాటిని వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ యూనివర్సిటీ గర్ల్ హాస్టళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, యూనివర్సిటీ ల అభివృద్ధికి ప్రతి యూనివర్సిటీ కి 500 కోట్ల నిధులు కేటాయించాలని,విద్యార్థులకు నెలకు స్టైఫండ్ 3000 రూ ఇవ్వాలని, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా నాయకులు సిర్రం పవన్ కుమార్,తే.యూ పి డి ఎస్ యూ నాయకులు జ్ఞానేశ్వర్, నితిన్, నవదీప్,ప్రశాంత్,మణిదీప్, వినయ్, మధు, రాధ కృష్ణ తదితదిరులు పాల్గొన్నారు.

# పిల్లలు సృజనాత్మకతతో కథలు కవితలు రాస్తున్నారు



సిరిసిల్ల టౌన్ 1 సెప్టెంబర్ 13 (జనంసాక్షి) పిల్లల్లో సృజనాత్మకత నింపుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాల్ని ఎప్పటికప్పుడు వివరిస్తే వారిలో పఠనాశక్తి పెంపొందితుందని పలువురు బాల సాహితివేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సిరిసిల్ల రంగినేని చారిటబుల్ ట్రస్టులో ప్రతి యేడు అందించే రేగులపాటి లక్ష్మి బాల సాహిత్య పురస్కార ప్రధానం శనివారం రోజున జరిగింది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన ఒక రోజు సదస్సు పురస్కార సభలో ఈ పురస్కారం అందించారు. ఉదయం 11 గంటలకు ట్రస్టు అధ్యక్షులు రంగనేని నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్, వి, రమణ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని మోహన్ రావు దంపతులు చేస్తున్న విద్యా, విజ్ఞానం గొప్పదని అది వారికే సాధ్యమని అన్నారు. ప్రస్తుత సలహాదారులు తూడి వెంకటరావు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ట్రస్ట్ చేస్తున్న పనులను వివరించారు.ప్రారంభ సభలో పిల్లల పండుగ కన్వీనర్ శ్రీమతి అమూల్య, కార్యదర్శి డాక్టర్ రేగులపాటి మహేష్ రావులు పాల్గొన్నారు తర్వాత జరిగిన మూడు బాలసాహిత్య సదస్సులో 60 మంది ప్రముఖ బాలసాహితి వెత్తలు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.ముక్కామల జానకిరామ్, ఎలగొండ రవి, సాగర్ల సత్తయ్య, చింతకుంట కిరణ్, ఆడెపు లక్ష్మణ్, పోరెడ్డి అశోక్, సౌమ్య, మదూరి అనితలు సమన్వయకర్తలు, వక్తలుగా పాల్గొన్నారు. నాలుగు గంటలకు జరిగిన రేగులపాటి రంగినేని లక్ష్మి బాల సాహిత్య పురస్కార సభకు సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథులుగా రంగినేని నవీన్ కుమార్, అమూల్య పురస్కారాలు అందించారు 2024 సంవత్సరానికి శ్రీమతి అఖిల వెంకట సుబ్బలక్ష్మి, 2020 సంవత్సరానికి శ్రీమతి ఎడ్ల లక్ష్మి, 2026 సంవత్సరానికి డాక్టర్ "సిరి" లకు ఈ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గరిపెల్లి అశోక్ పురస్కారాన్ని పరిచయం చేయగా డాక్టర్ మహేష్ లు ఇతర అతిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ 2016లో పిల్లల కార్యశాలల సంస్కృతికి, ట్రస్ట్ జరిపిన కార్యశాల గొప్ప భూమికను ఇచ్చిందని,. పిల్లల్లోని సృజనాత్మకతను వారిలోని శక్తులను వెలికి తీసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. సంబంధించిన పుస్తకాలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సాహితీ వేత్త లు పాల్గొన్నారు.

# సాంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్12 జనంసాక్షి: సాంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శ్రీ ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం నగరంలోని మార్వాడిగల్లి లో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చెందాలను రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా సుమారు 800 మండపాలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు. వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు



జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు తమ మండపాల ముందు బాలగంగాధర్ తిలక్ చిత్రపటాన్ని ఉంచాలని సూచించారు. ఉత్సవాలతో అందరూ ఒకచోట చేరి సామూహిక ఐక్యతను పెంపొందించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కిసాన్ షాపింగ్ మాల్ వద్ద మట్టి వినాయకుల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెదిరే విజేందర్

**గన్నేరువరం,సెప్టెంబర్12(జనంసాక్షి):**గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెదిరే విజేందర్ కు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయనకు కీలక పదవి దక్కింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ నియామక పత్రాన్ని విజేందర్ కు అందజేశారు. నూతనంగా నియామకమైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెదిరే విజేందర్ ను గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్ ఆధ్వర్యంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మేడిపల్లి సత్యం, మానకొండూరు నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ కు



కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు కటకం తిరుపతి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మరియు మాజీ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, గన్నేరువరం గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశరాజు అనిల్, మండల నాయకులు దొగ్గల ప్రదీప్, బుర్ర మల్లేశం గౌడ్, పాకాల పార్వారం, తదితరులు పాల్గొన్నారు.

# చిగురుమామిడి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిట్టుమల్ల రవీందర్

**చిగురుమామిడి సెప్టెంబర్ 12(జనంసాక్షి)**:చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)నూతన చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు.సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఆయనతో పాటు 12మంది నూతన డైరెక్టర్లతో అధికారికంగా ప్రమాణస్వీకారం చేయిచారు .చైర్మన్ రవీందర్‌తోపాటు ప్రమాణస్వీకారం చేసిన వారిలో డైరెక్టర్లు చాడ మహిపాల్ రెడ్డి,పోటు మల్లారెడ్డి,చిట్యాల బాల్ రేడ్డి,పచ్చిమట్ల లక్ష్మీ, కూతాటి తిరుపతి,శ్రీరామోజు రాజకుమార్, చింతపుల సాయన్న,కనగడ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, బెజ్జంకి భాగ్య, పిల్లి కొమురయ్య ,బొమ్మగాని పరుశురాములు ఉన్నారు. ప్రమాణస్వీకార



మహోత్సవం అనంతరం సింగిల్ విండో కార్యాలయంలో నూతన పాలకవర్గానికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ,స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు చింతపుల నరేందర్,అల్లెపు సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు బడుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్,గుళ్ళ రాజు ,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,పూదరి వేణు,ఎనగందుల లక్ష్మణ్,మాచమల్ల రమణయ్య, బోయిని నరేష్,గట్టు ప్రశాంత్,సోషల్ మీడియా మండల కన్వీనర్ జిల్లేల రమేష్, పోతర్ల శివాంజనేయులు,గంగిపెల్లి సురేష్, ఎలగందుల శివకుమార్ తోపాటు పలువురు సహకార సంఘ ప్రతినిధులు,రైతులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# రైతుల శ్రేయస్సు కోసం నెలరోజుల పాటు ఉపవాసాలతో భజనలు



**సదాశివనగర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**సదాశివనగర్ మండలం తిమ్మాజివాడి గ్రామంలోని శ్రీ హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన నెలరోజుల హనుమాన్ భజన కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. గత అమావాస్య నుంచి ఈ అమావాస్య వరకు హనుమంతుని ఆలయంలో భజన మండలి సభ్యులు ఉపవాస దీక్షలు చేపట్టి ప్రతిరోజూ భక్తి గీతాలు, భజనలు నిర్వహించారు.గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.ముగింపు సందర్భంగా హనుమంతునికి సింధూరం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిర నైవేద్యాలు సమర్పించి హారతి ఇచ్చి భజన కార్యక్రమాలను ఘనంగా ముగించారు.నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేసిన శ్రీ హనుమాన్ భజన మండలి సభ్యులకు గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వినాయకుడి ఆకృతిలో విద్యార్థుల సందడి



**సదాశివనగర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సదాశివనగర్ మండలం పద్మాజివాడి ఎక్స్‌రోడ్‌లోని శ్రీ సాయి విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు వినూత్న రీతిలో వేడుకను నిర్వహించారు. విద్యార్థులు సమిష్టిగా వినాయకుడి ఆకృతిలో నిలబడి అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయానికి సృజనాత్మకతను జోడిస్తూ చేపట్టిన ఈ ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకర్షించింది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ విద్యార్థులను అభినందించారు. పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణం కాపాడుట అందరి బాధ్యత

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్12(జనం సాక్షి);**లయన్స్ క్లబ్ ఆఫ్ సిరిసిల్ల ఆధ్వర్యంలో స్థానిక తక్షశిల ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారి సహకారం తో మరియు పి,డి, జి, లయన్ అనంతుల శివప్రసా ద్ ప్రత్యేక చొరవతో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి వినాయ క



విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. దాదాపు 100 మంది విద్యార్థులు ఇట్టి మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని చాలా చక్కగా విగ్రహాలను తయారు చేయడం జరిగింది.విగ్రహ తయారీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తరగతుల వారిగా ప్రథమ,ద్వితీయ బహుమతులు అందించడం జరిగింది.మరియు అందరికీ ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సిరిసిల్ల ప్రతినిధులు లయన్ చేపూరి శ్రీనివాస్, లయన్ పబ్బ నాగరాజు, లయన్ మడుపు నవీన్ రెడ్డి, లయన్ కొత్తపల్లి శ్రీధర్, లయన్ నంగునూరి శ్రీకాంత్, లయన్ బచ్చు భానుచందర్ , తక్షశిల స్కూల్ కరస్పాండెంట్ మడుపు శ్రీకాంత్ రెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ కి ఘన సన్మానం



మంథని, సెప్టెంబర్ 12, (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని రాజమౌళిలో గల పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికైన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వొడ్నాల శ్రీనివాస్ ని పద్మశాలి సంఘం నాయకులు, కుల బాంధవులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పద్మశాలి సంఘం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవలందిస్తున్న నూతన ప్రజాప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరభద్ర అనిల్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్ గూడెం వెంకటరమణ, ఎల్. రమణ, గుండు సుధారాణి, పెద్దపల్లి జిల్లా చైర్మన్ వలస నీలయ్య, మాజీ సర్పంచ్ మేముని వెంకటటేస్వామి, సర్పంచ్ నాగుల రాజయ్య, మాజీ సర్పంచ్ రామ్ రామ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరై వొడ్నాల శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మశాలి సంఘం నాయకులకు, కార్యక్రమంలో పాల్గొన్న కుల బాంధవులకు వొడ్నాల శ్రీనివాస్ కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

## హెచ్‌సీఏ వేదికపై కమాన్‌పూర్ కుర్రాడి సత్తా




కమాన్‌పూర్, సెప్టెంబర్ 12, (జనంసాక్షి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న అండర్--16 టోర్నమెంట్‌లో కరీంనగర్ కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు తరఫున బరిలోకి దిగిన కమాన్‌పూర్‌కు చెందిన యువ క్రికెటర్ అజయ్ చంద్ర అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. . అతని బౌలింగ్ గణాంకాలు 8--0--38--5 గా నమోదయ్యాయి. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన నల్లగొండ లత- రవి గౌడ్ కుమారుడైన అజయ్ చంద్ర గౌడ్ అండర్--16 స్థాయిలో హెచ్‌సీఏ టోర్నీలో ప్రతిభ చాటడం పట్ల కుటుంబ సభ్యులు, కోచ్‌లు, క్రికెట్ అభిమానులు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత రాణించి ఉన్నత స్థాయి క్రికెట్‌లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

### వెన్నంపల్లి పి ఎ సి ఎస్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న పంతంగి రవీందర్ గౌడ్

సైదాపూర్ సెప్టెంబర్ 12 (జనం సాక్షి) వెన్నంపల్లి విశాల పరపతి సంఘం నూతన అధ్యక్షులుగా మరియు పాలకవర్గం శనివారం రోజున ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం రవీందర్ మాట్లాడుతూ రైతులే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రైతుల అవసరాలపై ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అర్హులైన ప్రతి రైతుకు సహకారంలో అందుబాటులో ఉంటానని అర్హులైన ప్రతి రైతుకు పంట రుణాలు అందేలా చూస్తానని అలాగే ఎరువులు విత్తనాలు సరఫరా గాని సాగు సీజన్ ప్రారంభించిన యూరియా డిఏపి ఇతర ఎరువులు గాని నాణ్యమైన విత్తనాలను కొరత లేకుండా మన సొసైటీ ద్వారా రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చాడ కొండల్ రెడ్డి సైదాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ గుండారపు నాయకులు శ్రీనివాస్ మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి సర్పంచులు కాంగ్రెస్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి

మంథని, సెప్టెంబర్ 12, (జనంసాక్షి) : బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం మంథని పట్టణంలో ని అంబేద్కర్ చౌక్ వద్ద రైతులతో కలిసి బీజేపీ నాయకులు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు గోస కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 24 గంటల కరెంటు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 7 గంటల కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వంత నియోజకవర్గంలో రైతులు నీళ్ల కోసం ధర్నా చేయడం సిగ్గు చేటు అన్నారు. వెంటనే రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు అందించాలని




లేదంటే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు అనంతరం విద్యుత్ అధికారులకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నియోజకవర్గ కో కన్వీనర్ నంపెల్లి రమేష్, మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్, సబ్బాని సంతోష్, కొయ్యడ సతీష్, పగే రంజిత్, కొండ్ర లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కా సదానందం,సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్,మట్ట శంకర్, మల్లారపు అరుణ్, చిలువేరు సతీష్, విశ్వాతేజ, సామల అశోక్, భానుప్రకాష్, తొట్ల రాజు రైతులు ,ఓదెలు, వెంకటేష్, రాములు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం విద్యుత్ సబ్ స్టేషన్ తనిఖీ చేసిన విద్యుత్ శాఖ డిఈ

గన్నేరువరం,సెప్టెంబర్12(జనంసాక్షి ):గన్నేరువరం మండల కేంద్రంలో 33/11 కెవిఏ సబ్ స్టేషన్ ను జిల్లా విద్యుత్ శాఖ డిఈ తిరుపతి శనివారం తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ లోని విద్యుత్ బ్రేకర్లను పరిశీలించారు. సంబంధిత రికార్డులను, విద్యుత్ యూనిట్ల వాడకాన్ని చూశారు. వ్యవసాయ రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. లో వోల్టేజీ సమస్య లేకుండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ సంబంధించిన ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలన్నారు. వినియోగదారుల కు నాణ్యమైన విద్యుత్తును అందించాల న్నారు. ఆయన వెంట ఏడిఈ నరేందర్, గన్నేరువ రం ఏఈ ఆంజనేయులు, లైన్మెన్ ఈదయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.విద్యుత్ శాఖ డిఈ,ఏడీఈ ని సన్మానించిన గన్నేరువరం రైతులు..గన్నేరువరం సబ్ స్టేషన్ లో విద్యుత్ శాఖ డిఈ తిరుపతి



శనివారం సందర్శించిన సందర్భంగా గన్నేరువరం యువరైతు సందవేణి ప్రశాంత్ ఆధ్వర్యంలో డిఈ తిరుపతి,ఏడిఈ నరేందర్, ఏఈ అంజనేయులును శాలువలు కప్పి సన్మానించారు. రైతుల సమస్య లను వినతి పత్రం ద్వారా డిఈ తిరుపతికి అందజేశారు. వినతి పత్రంలో మండలంలోని రైతులకు నిరంతరం కరెంటు అందించకపోవడం వలన పంట పొలాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కరెంటు సమస్యతో రైతుల పంటలు పండక నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల కరెంటు అందించి రైతులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోయిని అంజయ్య, బొడ్డు బాలయ్య, కాంతాల కొండల్ రెడ్డి, కాంతాల కిషన్ రెడ్డి, కాంతాల పాల్గొన్నారు.

# ఖేలో ఇండియాలో పతకాలు సాధించి తెలంగాణను నంబర్ వన్ గా నిలపాలి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) : వచ్చే డిసెంబర్లో తెలంగాణలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో యోగా క్రీడాకారులు ఎక్కువ పథకాలు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో జరిగిన 17వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల యోగా పోటీల ముగింపు కార్యక్రమానికి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వతహాగా క్రీడాకారుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని దానిలో భాగంగా ప్రతిష్టాత్మక కేసులో ఇండియా పోటీలకు మన రాష్ట్రం ఆతిథ్యమిస్తుందన్నారు. యోగాతో పాటు మిగతా క్రీడల్లో రాణించి తెలంగాణను నంబర్ వన్ గా నిలపాలన్నారు. యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు పరిచయం అయిందని రానున్న ప్రపంచ స్థాయి యోగా పోటీల్లో భారతదేశానికి తిరుగు లేదన్నారు. చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ... యోగాకు చిరునామాగా కరీంనగర్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. గతంతో పోలిస్తే నేడు




క్రీడల్లో సదుపాయాలు మెరుగయ్యాయని, ప్రతిభ ఉన్న ఆటగాడికి ప్రోత్సహించేందుకు ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నట్లు చెప్పారువరుసగా 17వ సారి కరీంనగర్ ఛాంపియన్గా నిలవడం ఇక్కడి క్రీడా ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా శిక్షణ పొందాలని అన్నారు ఓవరాల్ చాంపియన్ గా "కరీంనగర్ కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి వరుసగా 17వ సారి ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం విశేషం. సెకండ్ ఓవరాల్ చంపియన్షిప్ గా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో సంయుక్తంగా సాధించగా, మూడో స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచింది. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు ట్రోఫీలతో పాటు వ్యక్తిగత మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాతీయస్థాయి పోటీలో పతకం సాధించిన దీపక్, ఫెడరేషన్ బాధ్యుడైన మనోజ్ కుమార్ ను అతిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి. జనార్దన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు టి. రమేష్ రెడ్డి, కన్న కృష్ణ , రాష్ట్ర యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.కమలాకర్, జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంటి రామకృష్ణ , మనోజ్, స్వరూపాచారీ, గంగాధర్, కిష్టయ్య, మల్లేశ్వరీ, ఆనంద్ కిషోర్ - వీణావాణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం

**కరీంనగర్ టౌన్,సెప్టెంబర్12,(జనం సాక్షి)**ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్కండేయ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, సీడీపీఓ కవిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా వారికి పౌష్టికాహారం అందేలా ప్రోత్సహించాలని అన్నారు. మహిళల్లో ఐరన్ లోపం నివారణకు మునగ, బచ్చలి తదితర ఆకుకూరలు, పల్లీలు, బెల్లం వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. సీజన్‌లో లభించే పండ్లు, తాజా కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు.గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు బరువు, ఎత్తును పరిశీలించుకోవాలని తెలిపారు.



తక్కువ బరువున్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా బాలామృతం అందిస్తున్నట్లు చెప్పారు .సీడీపీఓ కవిత గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు శ్రీలత, రమణ , ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణిలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి

యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12: సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్జీ-2 జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఐలి శ్రీనివాస్ మాట్లాడుతూ గత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 2023 డిసెంబర్ 27న జరిగినట్లు తెలిపారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినప్పటికీ సంబంధిత పత్రం తీసుకోవడంలో జాప్యం జరిగి 2024 సెప్టెంబర్‌లో తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ కాలపరిమితి కూడా ముగిసినందున సింగరేణిలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు సింగరేణిలో అనేక సమస్యలు పేరుకుపోయి



కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంస్థ భవిష్యత్తు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థను కాపాడుకోవడానికి కార్మిక సంఘాల భాగస్వామ్యంతో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు బేతి చంద్రయ్య, ఓసీపీ-3 ప్రాజెక్ట్ కార్యదర్శి మామిడి తిరుపతి, వకీల్‌పల్లి గని కార్యదర్శి వెంకటేశం, దాసరి శ్రీనివాస్, పల్లె నాగరాజు, బేతి రవితేజ, మార్క్ నరేష్, చౌడ శ్రీనివాస్, వై. రమేష్, కందుల కుమారస్వామి, నన్నువల రాకేష్, గెల్లు సదయ్య, ఐ. శ్రీనివాస్, కమలాకర్ రావు, బెజ్జాల రమేష్, కచూ శ్రీనివాస్, జీవన్, సాయిరామ్, రవీందర్, దినేష్, సతీష్, సంతోష్, నల్ల మహేందర్, నాయక్‌తో పాటు పలువురు కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

**మేడిపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం లో తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా కొండాపూర్ గ్రామంలో పాటలు, మాటలు, ఆటలతో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను కమ్యూనిస్టు పార్టీ నాయకులు వివరించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటంలో పేదలు, రైతులు, కూలీలు, మహిళలు చూపిన ధైర్యసాహసాలు, వీరత్వం, త్యాగాలు మరువలేనివని నాయకులు అన్నారు. దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు ఐక్యంగా పోరాడి, సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంచడం, 3,000 గ్రామాలను విముక్తి చేయడం, 4,500 మంది అమరుల



త్యాగాలు వంటి విజయాలను సాధించారని తెలిపారు. నాటి పోరాట ఫలితాలు, త్యాగాలు నేటి



తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేడు ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, విద్య, వైద్యం, వ్యవసాయ సంక్షోభం,పోరాడిసాదించుకున్న కార్మికుల హక్కుల హననం, సామాజిక సమస్యలు, అవినీతి ,ప్రజాస్వామ్య హక్కుల సమస్యలు పరిష్కారం కావాలంటే నాటి తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. పాలకవర్గ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని కోరారు. త్యాగాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా కింద ప్రజలు ఐక్యమై తమ హక్కుల కోసం పోరాట బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమము గ్రామశాక కార్యదర్శి చెరుకూరి రాజేశం అధ్యక్షతన వహించాగా తెలంగాణ సాయుధ పోరాటాల జెండాను సీనియర్ నాయకులు ఏద్దండి భూమయ్య ఆవిష్కరించి సందేశం ఇచ్చారు. ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు చిట్యాల లక్ష్మణ్, బట్టు రాజయ్య వారి బృందం పాటలు పాడారు.మండల కార్యదర్శి మునుగూరి హన్మంతు ,పార్వడ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు ఎదలాపురం దుబ్బరాజం. ఎదలాపురం గంగారాజం, పిట్టల నారాయణ.ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు .మున ంగూరి గంగానరసయ్య (కాచారం )పల్లి రాములు, భీమారం. చిలువేరి గంగాచారి, మేడిపల్లి. సీనియర్ నాయకులు రాంపల్లి రవి, నరవేనాగంగు, కునారపు లక్ష్మీ నరసవ్వ, గొడుగు లక్ష్మి, కునారపు మంజుల తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రుద్రంగిలో బీఎస్పీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం



**రుద్రంగి, సెప్టెంబర్ 12 (జనం సాక్షి)**బహుజన సమాజ్ పార్టీ రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు కట్కూరి శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రుద్రంగి గ్రామానికి చెందిన ధర్నా ఎల్లయ్య యాదవ్ బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఉన్న పార్టీలన్నీ అగ్రకులాల ఆధిపత్యంలో కొనసాగుతున్నాయని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజ్యాధికారం కోసం బహుజన సమాజ్ పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు.అనంతరం ధర్నా ఎల్లయ్య యాదవ్ ను వేములవాడ నియోజకవర్గ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో రుద్రంగి మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల సతీష్, మండల కోశాధికారి కట్కూరి వినోద్, సీనియర్ నాయకుడు కదాసు మహేందర్, మండల సలహాదారు కదాసు అనిల్, రుద్రంగి గ్రామ అధ్యక్షుడు నల్ల నవదీప్, గ్రామ ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్, కోశాధికారి బొడ్డు చిరంజీవి, గాసికంటి అరుణ్, అక్కెనపెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ నాయకుల ధర్నా



**గంభీరావుపేట, సెప్టెంబర్ 12, జనం సాక్షి:**వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలు విధించడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడ్ రమేష్ ఆధ్వర్యంలో గజసింగవరం గ్రామం వద్ద కామారెడ్డి--సిరిసిల్ల ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కోడ్ రమేష్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రైతులు నాట్లు వేసుకున్నారని, ప్రస్తుతం అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు.విద్యుత్ కోతలు కొనసాగితే రైతులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు



సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడ ంతో బీజేపీ నాయకులు ధర్నా విరమించారు .కార్యక్ర మంలో బీజేపీ ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షుడు చేపూరి సత్యనారా యణ, మండల ప్రధాన కార్యదర్శి తొట్ల మల్లేష్ యాదవ్, నాయ కులు ఎక్కలదేవి చంద్రం, దేవేందర్ యాదవ్, రాజు, శ్రీనివాస్, సర్వోత్తమ్, బండ దేవయ్య, నాయిని దేవరాజు, పుల్యా నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులనే పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం



గంగాధర సెప్టెంబర్ 12 (జనంసాక్షి):వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని నరేంద్ర విద్యాలయం హైస్కూల్ కరస్పాండెంట్ గంగాధర రాజేశం,గుజ్జుల గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు అత్యంత భక్తి ఉత్సాహంతో మట్టి విగ్రహాలను వివిధ ఆకృతులతో వినాయకులను తయారు చేశారు. . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగుల తో రసాయనాలను ఉపయోగించి విగ్రహాలు తయారు చేయడం వల్ల నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. మట్టి విగ్రహం ప్రతిష్ట చేసుకుంటే ఎలాంటి కాలుష్యం ఉండదన్నారు.విద్యార్థులు తమ తల్లితండ్రులకు వివరించాలని కోరారు.ఈకార్యక్రమంలో పాఠశాల టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏరియా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఓసీపీ3 జట్టు విజయం



యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి): ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏరియా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా శనివారం సీఈఆర్ క్లబ్‌లో బాస్కెట్‌బాల్ (ఆన్ డ్యూటీ) పోటీలు ఉత్సాహంగా జరిగాయి.హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఓసీపీ-3 జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. వీకేపీ జట్టు రన్నరప్‌గా నిలిచింది.ఈ కార్యక్రమంలో జనరల్ కెప్టెన్ ఏ. రవీందర్, ఆర్గనైజర్ జాడి ఆంజనేయులు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ అక్రమ్ పాల్గొని విజేతలు, క్రీడాకారులను అభినందించారు. అనంతరం కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# సాగునీళ్ల కోసం రైతుల ఆందోళన

ఇల్లంతకుంట సెప్టెంబర్ 12(జనంసాక్షి )మధ్యమానేరు ప్రాజెక్టు కుడికాల్వతో పాటు ఎంఎంఆర్ దిగువ ప్రాంతానికి సాగునీరు విడుదల చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లంతకుంట మండలం పొత్తూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాగునీరు అందక సుమారు 8 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు.సోమవారం లోగా మధ్యమానేరు కుడికాల్వకు నీరు విడుదల చేయకపోతే, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మంగళవారం వేలాది మంది రైతులతో చలో మధ్యమానేరు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని పంపించి, కుడికాల్వతో పాటు ఎంఎంఆర్ దిగువ ప్రాంతానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సర్పంచ్ పట్నం అశ్వినిఉపసర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) : కరీంనగర్ నగరం, డివిజన్ అభివృద్ధిలో భాగంగా 42వ డివిజన్ లోని కాశ్మీర్ గడ్డ మునావర్ మసీదు వీధిలో నూతనంగా చేపడుతున్న సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల సమయంలో స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... గతంలో 42వ డివిజన్ ఏ విధంగానైతే సమస్యలు లేని డివిజన్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందో, అదే విధంగా కొత్తగా డివిజన్‌లో కలిసిన అన్ని ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. డివిజన్ లో కొత్తగా కలిసిన వివేకానంద స్కూల్ పరిసర ప్రాంతాల్లో, త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించి, స్థానిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ క్వార్టర్స్ వద్ద ఉన్న పార్కును త్వరలోనే అధునాతన రీతిలో అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు పునరంకితం చేయనున్నట్లు వెల్లడించారు. డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులన్నీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.చంద్రమౌళి శ్రీధర్, అశోక్, వినోద్ కుమార్, విజయ భాస్కర్, ఖాదర్ ఫారుకి, ఇబ్రహీం, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద నిబంధనలు తప్పక పాటించాలి



యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గౌరవ రామగుండం పోలీస్ కమిషనర్, డీఐజీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ ఆదేశాల మేరకు గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు సమన్వయ సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రతి వినాయక విగ్రహాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, కమిటీ సభ్యుల వివరాలు, విగ్రహం ఎత్తు, నిమజ్జనం చేసే ప్రాంతం తదితర వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విగ్రహాలకు పోలీసులు జియో ట్యాగింగ్ చేసి అవసరమైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.వర్షాలకు మండపాలు తడిసి కుంగిపోకుండా పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు), నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో విగ్రహం వద్ద ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద తక్కువ శబ్దం వచ్చే సౌండ్ బాక్సులను మాత్రమే వినియోగించాలని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎలాంటి పాటలు, కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అశ్లీల నృత్యాలు, పాటలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మైక్ సిస్టమ్‌ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు.అలాగే పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.పోలీస్ శాఖ సూచించిన అన్ని నియమ నిబంధనలను వినాయక మండపాల కమిటీ సభ్యులు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీతో పాటు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్. లింగమూర్తి, గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, వివిధ వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల ఏర్పాట్లపై సమీక్ష




యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12: సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రామగుండం ఏరియా-2 పరిధిలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ అండ్ రికవరీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల ఏర్పాట్లపై శనివారం రెస్క్యూ స్టేషన్‌లోని సేఫ్టీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు .ఆర్జీ-2 జనరల్ మేనేజర్ శ్రీ జి. లక్ష్మీపతి గౌడ్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశంలో పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన



ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వివిధ విభాగాల సమన్వయంపై చర్చించారు.ఈ సందర్భం గా రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీ కె. శ్రీనివాసా రెడ్డి మాట్లాడుతూ, జోనల్ మైన్స్ రెస్క్యూ అండ్ రికవరీ పోటీల్లో సింగరేణితో పాటు దేశంలోని ప్రముఖ గనుల సంస్థలకు చెందిన జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. హిందుస్థాన్ జింక్ నుంచి నాలుగు జట్లు, మహారాష్ట్ర గోల్డ్ మైన్స్ నుంచి రెండు జట్లు, హట్టి గోల్డ్ మైన్స్, తమిళనాడు, తుమ్మలపల్లి కాంబినేషన్ జట్లతో కలిపి మొత్తం 10 జట్లు పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు.పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు మైన్స్ రెస్క్యూ స్టేషన్‌తో పాటు జీడీకే-7 ఇంక్లైన్ గని వద్ద అవసరమైన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ సమావేశంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బీవీ సత్యనారాయణ, ఏజీఎం (ఈఅండ్‌ఎం) శ్రీ చంద్రశేఖర్, డీజీఎం (ఈఅండ్‌ఎం, ఏరియా వర్క్‌షాప్) శ్రీ రాంరెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ సునీల్ ప్రసాద్, రెస్క్యూ సూపరింటెండెంట్ శ్రీ జి. రాజేందర్ రెడ్డి, సివిల్ ఎస్ఈ శ్రీ బాలరాజు తదితరులు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా ఉత్సాహంగా పారమిత ఉపాధ్యాయుల సమ్మేళనం

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** :కరీంనగర్ పట్టణంలోని రేకుర్తి శుభం కన్వెన్షన్ లో ఏకత్వ అనే పేరుతో పారమిత ఉపాధ్యాయుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారమిత ఉపాధ్యాయులు నృత్యాలు, నాటకాలు, పాటలతో వివిధ సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పారమిత పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుల మధ్య ఆహ్లాదకరమైన, స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా పారమిత విధ్యాసంస్థల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇలాగే ప్రతి రోజు ఉపాధ్యాయులు ఆనందంగా ఉత్సాహంగా ఉంటూ సమాజానికి




మార్గదర్శకులుగా ఉండాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ సంధర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు ఇచ్చిన గౌరవానికి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారమిత విధ్యాసంస్థల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోద్ రావు, రాకేశ్, ప్రాచి, వి.యు.యం.ప్రసాద్, హనుమంత రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, ప్రశాంత్, బాలాజీ, గోపికృష్ణ ,కవిత, శర్మిష్ఠ,సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గడపగడపకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12:** ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి ఆదేశాల మేరకు 18వ డివిజన్‌లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. 8వ కాలనీ పరిధిలోని ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలపై అవగాహన



కల్పించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గుండేటి రాజేష్, జక్కుల దామోదర్, పోగుల వీరారెడ్డి, మోత్కు అవినాష్, మారం కుమార్ యాదవ్, మార్కరాజు, ఇరికి మహేష్, పరకాల ప్రశాంత్, బూర్ల సంపత్, నాగవెల్లి శంకర్ తదితర నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు మట్టి గణపతులే ముద్దు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:**భారతీయ సనాతన సంప్రదాయంలో పండుగలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కావు అవి మన ఆర్థిక వ్యవస్థను, సమాజ బంధాలను బలోపేతం చేసే మహత్తర వేదికలు. కోట్ల రూపాయల వ్యాపారం, లక్షలాది మందికి ఉపాధి కల్పించే పండుగలను మరింత బాధ్యతాయుతంగా జరుపుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. నేడు పండుగ అంటే భక్తి కంటే ఆర్భాటం, సంప్రదాయం కంటే ప్రదర్శన ఎక్కువై, మన జీవనాధారమైన ప్రకృతికి తీరని ముప్పు వాటిల్లుతోంది.ఈ తరుణంలో "మట్టి గణపతులు వాడండి... పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్యూా) ని వాడకండి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా ఉండండి అంటూ ప్రజలకు నిరంతరం సంకేతాలిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, పర్యావరణ ప్రేమికుల కృషి నిజంగా అభినందనీయం, వారికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!
అయితే, ఈ యుద్ధం ఎంత చేసినా, ఎంతలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా పండుగ వేళ ప్రజల మనస్తత్వాలలో పూర్తిస్థాయి మార్పు రావడం లేదు.స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నా, నామమాత్రపు ధరకే పర్యావరణ హితమైన విగ్రహాలను అందిస్తున్నా, చాలా మంది రసాయన రంగులతో, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ఆకర్షణీయమైన విగ్రహాల వైపే మొగ్గు చూపుతున్నారు.కెమికల్స్ కలిసిన అలాంటి విగ్రహాలను జలశయాల్లో నిమజ్జనం చేయడం ద్వారా చెరువులు, నదులు తీవ్రమైన కాలుష్య



కోరల్లో చిక్కుకుంటున్నాయి. మరోవైపు పండుగ పేరుతో దండగ ఖర్చులు చేయడం, భారీ ఫ్లెక్సీలు కట్టడం, ప్లాస్టిక్ పూలు, ఒక్కసారి వాడిపడేసే (యూజ్ అండ్ త్రో) ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయి పరిసరాలపై, నీటి వనరులపై తీవ్రమైన భారం పడుతోంది.ఎంతమంది మేధావులు, స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేసినా, స్వచ్ఛందంగా ప్రజల్లో పరిపూర్ణమైన మార్పు రానప్పుడు కేవలం విజ్ఞప్తులతో సరిపెట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రభుత్వాలు, పాలకులు మరింత గట్టిగా స్పందించాల్సిన సమయం ఇది. కేవలం మొక్కుబడి హెచ్చరికలు కాకుండా, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్యూా) విగ్రహాల తయారీని, అమ్మకాలను పాలకులు వెంటనే బ్యాన్ (నిషేధించాలి) చేస్తేనే క్షేత్రస్థాయిలో కరెక్ట్ గా ఉంటుంది, అప్పుడే అసలైన మార్పు వస్తుంది. చట్టపరంగా కఠినమైన నిబంధనలు రూపొందించి, వాటిని అధికారులు సమర్థవంతంగా అమలు చేసినప్పుడే ప్రజల్లో నైతిక బాధ్యత పెరుగుతుంది.మార్పు ఎవరికో దూరంగా ఎక్కడో జరగాలని కోరుకోవడం కంటే, అది మన ఇంటి నుంచే మొదలు కావాలి. ప్రభుత్వాలు నిబంధనలు విధించడం ఎంత ముఖ్యమో, ప్రజల్లో ఆచరణాత్మక మార్పు అంతకంటే ముఖ్యం. వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే ప్రతిష్ఠించాలి.అనవసర ఆర్భాటాలు, భారీ ఫ్లెక్సీలకు స్వస్తి పలికి, సహజమైన పూలు, మట్టి విగ్రహాలనే ఉపయోగించాలి.నీటి వనరులను కాపాడుకుంటూ పండుగను ప్రకృతితో మమేకం చేయాలి. పండుగ జరుపుకోవడంలో ఎవరి భక్తి తగ్గకూడదు, సంప్రదాయం తగ్గకూడదు, కానీ అనవసర ఆర్భాటాలు, ప్లాస్టిక్ వినియోగం మాత్రం పూర్తిగా అంతం కావాలి. ఈసారి గణపతి పండుగ నుంచి ఒక చిన్న మార్పును ప్రారంభిద్దాం... ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను పూర్తిగా బహిష్కరిస్తూ, మట్టి గణపతిని పూజిద్దాం, మన పర్యావరణాన్ని కాపాడుకుందాం.



# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 50వ డివిజన్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ స్వయంగా ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జల వనరులు కలుషితమవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమల వినియోగాన్ని ప్రోత్సహించాలని, మన సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాలనీవాసులు, డివిజన్ ప్రముఖులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు.

# కమాన్‌పూర్‌లో పద్మశాలి నూతన బాధ్యులకు ఘన సన్మానం



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** కమాన్‌పూర్ మండలంలోని శ్రీ ఆదివరాహ స్వామి దేవస్థానం ఆవరణలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవనపల్లి చక్రపాణి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన గుండేటి రాజేష్, రామగిరి మండల పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బండారి సదానందంలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం చేనేత దినోత్సవం సందర్భంగా అందజేయాల్సిన షీల్డ్ జ్ఞాపికలను వారికి అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కుందారపు బాపు మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన చేనేత దినోత్సవ కార్యక్రమానికి చక్రపాణి, రాజేష్ అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయారని తెలిపారు. దీంతో వారికి అందించాల్సిన జ్ఞాపికలను ప్రస్తుతం అందజేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, బూర్ల సంపత్, కుంట చక్రవర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి 1990 టెన్త్ బ్యాచ్ స్నేహితుల అండ

హుజూరాబాద్, సెప్టెంబర్ 12 ( జనం సాక్షి):తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి 1990 టెన్త్ బ్యాచ్ హైస్కూల్ స్నేహితులు అండగా నిలిచారు. హుజూరాబాద్ పట్టణంలోని క్రింది వాడకు చెందిన ముల్కనూరి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమతో కలిసి చదువుకున్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు అదే బ్యాచ్కు చెందిన మిత్రులు ముందుకొచ్చారు. మానవతా దృక్పథంతో కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సత్యనారాయణ అకాల మరణం పట్ల మిత్రులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆయన కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. మిత్రుడి కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రతన్ ప్రసాద్, నంబి భరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బోధన్, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) : గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఎసిపి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సాలూర మండల కేంద్రంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, విద్యుత్, అగ్నిప్రమాదాలు తదితర అంశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మండల తహసీల్దార్, ఎలక్ట్రిసిటీ ఏఈ, బోధన్ రూరల్ సీఐ శ్రీ విజయ్ బాబు, బోధన్ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు

## బాల సాహిత్యం చాలా గొప్ప సాహిత్యం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:బాల సాహిత్యం చాలా గొప్ప సాహిత్యమని రచయిత్రి, కవయిత్రి సమత తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకత, మంచి ఆలోచనలు, మానవీయ విలువలు పెంపొందించడంలో బాల సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.రంగినేని సుజాతా మోహన్‌రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో "మన బాల సాహిత్యం ఎంతవరకు చేరుతుంది, ఎందుకు?" అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో కవయిత్రి సమత పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాల సాహిత్యానికి ఉన్న ప్రాధాన్యతను, అది చిన్నారులకు మరింత చేరువ కావాల్సిన అవసరాన్ని వివరించారు .పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సాహిత్య సంస్థలు కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం కవయిత్రి సమతను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కవయిత్రులు, రచయితలు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## మార్కండేయ మందిరం పున నిర్మాణానికి భూమిపూజ

ఎడపల్లి, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకం పేట్ గ్రామంలో గల మార్కండేయ మందిరం పునః నిర్మాణానికి శనివారం



భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ మందిరం అధ్యక్షులు చిలుక వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించా రు. మందిరం పునఃనిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, భక్తులకు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విట్టల్, చిలుక నారాయణ, ప్రవీణ్, లక్ష్మణ్, మల్లేష్, నగేష్, అనంత స్వామి తదితర కులబాంధవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12: కార్మికుల సమస్యల పరిష్కారమే ఐ ఎన్ టి యు సి ప్రధాన లక్ష్యమని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు రామగుండం ఏరియా-2 (ఆర్జీ -2) పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం శనివారం ఏరియా జనరల్ మేనేజర్‌ను కలిసి సమగ్ర మెమొరాండం అందజేశారు.ఆర్జీ -2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికుల సంక్షేమం, భద్రత, పని పరిస్థితులు, అవసరమైన సౌకర్యాలు, యంత్రాల నిర్వహణ, ఉత్పత్తికి సంబంధించిన సమస్యలు తదితర అంశాలను నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కార్మికుల సమస్యలను జీఎం సానుకూలంగా విని, వాటిని పరిశీలించి



పరిష్కరించేందుకు తగినఐ ఎన్ టి యు సి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం ఐ ఎన్ టి యు సి ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలిచి నిరంతరం పోరాడుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సలిగామ మల్లేష్, వసంశెట్టి మార్కండేయ, బ్రాంచ్ సెక్రటరీలు చిలుముల అవినాష్, వాసల అశోక్, నాయకులు ఆవుల లక్ష్మణ్, సెనిగరపు నాగేశ్వర్, ప్రవీణ్ కుమార్, పిట్ సెక్రటరీలు భూమయ్య, దిలీప్, తిరుపతి, వంగ సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి 18 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి: జిల్లాలో వ్యవసాయ రంగానికి లో-వోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా రోజుకు 18 గంటల పాటు సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతాంగం సుమారు 2.5 లక్షల వ్యవసాయ పంపుసెట్ల కింద దాదాపు 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించ,చడంలో విఫలమైందన్నారు.ప్రస్తుతం సరఫరా చేస్తున్న అరకొర 7 నుంచి 8 గంటల కరెంట్ కూడా లో-వోల్టేజీతో వస్తుండటంతో వ్యవసాయ బోర్ల మోటార్లు కాలిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటలకు సకాలంలో నీరందక అన్నదాతలు ఆర్థిక



నష్టాలను చవిచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎలాంటి లో-వోల్టేజీ, సరఫరా అంతరాయాలు లేకుండా రోజుకు 18 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్ కార్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, కర్క గంగారెడ్డి, తోట చిన్నయ్య, రాజేశ్వర్ రెడ్డి, అన్నం గోపి, పద్మా రెడ్డి, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి, నాయిడి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి జగిత్యాల హైవే పై సీసీ కెమెరాల ఏర్పాటు

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని అదనపు డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, రూరల్ ఏసిపి విజయ్ కుమార్, కొత్తపల్లి సీఐ బి.కోటేశ్వరరావు లతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. కొత్తపల్లి - జగిత్యాల హైవే పై ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి, ఏసీపీ - రూరల్ విజయ్ కుమార్, కొత్తపల్లి సీఐ బి.కోటేశ్వర్ గౌరవ అతిథులుగా హాజరై, కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రధాన రహదారులు, హైవేల పై ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు 24x7 నిఘా, వాహనాల కదలికల పర్యవేక్షణ, ప్రమాదాల గుర్తింపు, నేరాలకు సంబంధించిన ఆధారాల సేకరణ వంటి అంశాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినప్పుడు సంఘటనకు సంబంధించిన దృశ్యాలను పరిశీలించడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడానికి వీలుంటుందని పేర్కొన్నారు. కొత్తపల్లి--జగిత్యాల హైవేపై ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా వాహనాల రాకపోకలను



పర్యవేక్షించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం, రోడ్డు ప్రమాదాలపై తక్షణ స్పందనకు సహకరించడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను గుర్తించడం వంటి చర్యలకు మరింత అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆధునిక సీసీ కెమెరా వ్యవస్థలలో హై - రిజల్యూషన్ వీడియో రికార్డింగ్, రాత్రి వేళల్లో నిఘా, వాహనాల నంబర్ ప్లేట్‌లను గుర్తించే సాంకేతికత, నిరంతర పర్యవేక్షణ వంటి సదుపాయాలు ఉండటం వల్ల హైవేల పై భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. ప్రజా సేవలో నిమగ్నమైన సమాజ హితమైన కార్యక్రమాలు చేస్తున్న నరేందర్ రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టి సమాజానికి చేయూతని ఇవ్వాలని వారు కోరారు డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా భద్రతకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజ హితంగా సేవలు అందిస్తున్న నరేందర్ రెడ్డిని పోలీసులు అభినందిం చారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సూచన మేరకు వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసుల మెగా రక్తదాన శిబిరం విజయవంతం

## 58 యూనిట్ల రక్తం సేకరణ

**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** సేవకు మారుపేరు శ్రీనివాస్ అనే నినాదంతో, "పేరు బంధం కాదిది... పేరు బంధం" అనే సత్సంకల్పంతో సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లో నిర్వహించిన "శ్రీనివాసుల మెగా రక్తదాన శిబిరం" విజయవంతంగా శనివారం ముగిసింది. ఈ శిబిరాల్లో మొత్తం 58 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు.తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ నిర్ణయం మేరకు ఇకపై ప్రతి నెల రెండో శనివారం క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9:30 గంటలకు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ ఆఓటూ నీలారపు శ్రీనివాస్ గారు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పూట్కూరితో కలిసి ప్రారంభించారు. అనంతరం కోరుట్లలో ఉదయం 10:30 గంటలకు శ్రీరాముల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్ మరియు శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కోరుట్లలో జరిగిన రక్తదాన కార్యక్రమంలో బి. సుష్మ గారు స్వయంగా రక్తదానం చేసి, మహిళలు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు.ప్రాంతాల వారీగా రక్తదాతల వివరాల జగిత్యాల: 18 మంది కోరుట్ల: 32 మంది కరీంనగర్: 8 మంది మొత్తం: 58 మంది.. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి మాట్లాడుతూ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు, అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి, ప్రమాదాలకు గురైన బాధితులకు సకాలంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడటమే రక్తదాన శిబిరాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీనివాసులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం సంస్థతో 40,000 మందికి పైగా శ్రీనివాసులు, 56 వాట్సాప్ గ్రూపుల ద్వారా సమన్వయం చేసుకుంటూ నిరంతరం సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని వివరించారు. జగిత్యాలలో , రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల సరస్వతి శిశు మందిర్ రక్తదాన శిబిరంలో శ్రీరాముల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, చిలుక శ్రీనివాస్, బెజ్జంకి శ్రీనివాస్, బెజ్జారపు తూం శ్రీనివాసరావు, జాగిలా శ్రీనివాసరావు శ్రీనివాస్, గాంధారి శ్రీనివాస్ అడ్వకేట్, శ్రీనివాస్ టీచర్, నీలారపు శ్రీనివాస్ డిప్యూటీ ఆఓటూ జగిత్యాల తదితరులు పాల్గొన్నారు.రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన ప్రతి రక్తదాతకు, కార్యక్రమ విజయానికి సహకరించిన సంస్థ సభ్యులకు, ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బందికి తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం – ప్రాణదానం అనే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రతి నెల రెండో శనివారం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి స్పష్టం చేశారు.



## భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి సీఐ రాజకుమార్

**మల్యాల సెప్టెంబర్ 12 (జనం సాక్షి)** మల్యాల మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలోగణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున అవసరమైన బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లు చేపడతామని సీఐ రాజ్ కుమార్ మరియు ఎస్ఐ సందీప్ తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత,అగ్నిమాపక జాగ్రత్తలు,తగినంత వెలుతురు,పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం,ట్రాఫిక్ నియంత్రణ మరియు వాహనాల పార్కింగ్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా చేసుకోవాలని ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద నిర్వాహకులు మరియు వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉండాలని, అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, రెచ్చగొట్టే పాటలు,ప్రసంగాలు లేదా ఇతర కార్యక్రమాలకు చేయరాదని,అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

## డిజిటల్ క్రాప్ సర్వేలో ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి - గడ్డం శ్యాం ప్రసాద్

**పెద్దపల్లి,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :** సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ నేడు పరిశీలించి,సర్వేలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన రైతులందరూ వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి, తమ పంటల వివరాలను యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని (డిహెచ్ఎస్ఓ) సూచించారు.డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా జిల్లాలో సాగు చేస్తున్న పంటలపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని, దీని ఆధారంగా భవిష్యత్‌లో మెరుగైన పథకాలు, సబ్సిడీలు అమలు చేయడం, రైతుల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త పంటలు మరియు కొత్త రకాలను పరిచయం చేయడం,మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని తెలిపారు.ప్రత్యేకంగా ఎర్ర మిరప, కూరగాయలు, పసుపు, పూలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయాలని సూచించారు.ఉద్యాన పంటల విస్తీర్ణంపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటే భవిష్యత్ ప్రణాళికలు మరియు ప్రభుత్వ పథకాల అమలు మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిన్నకల్వల గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రావంతి రమేష్, ఉద్యానవన విస్తరణ అధికారి (హెచ్ ఈ ఓ) మహేష్, వ్యవసాయ శాఖ సర్వే వాలంటీర్ హరీష్ మరియు రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు

### - ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో ఉత్సాహంగా పోటీలు

సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సుల్తానాబాద్ మండల ఎంఈఓ రాజయ్య, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో శనివారం పెద్దపల్లి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా నిర్వహించారు.పోటీలను ఎంఈఓ రాజయ్య,జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, పీఈటీ కార్యదర్శి దాసరి రమేష్,సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు.ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టేబుల్ టెన్నిస్‌లో నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విజయమే లక్ష్యంగా తలపడ్డారు. పోటీల అనంతరం విజేతలకు పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్ తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా, సరస్వతి, ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సత్యనారాయణ విద్యార్థులు,తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

### - వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

కోనరావుపేట (జనంసాక్షి): గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు అన్నారు.శనివారం కొనరావుపేట పోలీస్ స్టేషన్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గణేష్ విగ్రహ ప్రతిష్టాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన నియమలపై అవగాహన కల్పించారు.గణేష్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా , గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐ రవీందర్ ఎస్సై రామ్మోహన్ విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## గాయత్రి విద్యానికేతన్‌లో మట్టి గణపతి విగ్రహాల తయారీ - పంపిణీ

**పెద్దపల్లి,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.సీనియర్ కళాకారుడి కూనా రం గ్రామానికి చెందిన నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఆసక్తిగా మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేయడం నేర్చుకున్నారు. స్వయంగా తయారు చేసుకున్న విగ్రహాలను సంతోషంగా తమ ఇళ్లకు తీసుకెళ్లారు.మన సంస్కృతి, సంప్రదాయాల వెనుక ఉన్న గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సుమారు 100 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.విద్యార్థులు,తల్లిదండ్రులు ఎంతో ఆనందంగా మట్టి గణపతి విగ్రహాలను తమ ఇళ్లకు తీసుకెళ్లారు.ఈ వర్షాకాలంలో చెరువు మట్టిని తీసుకొని వచ్చి దానితో గణపతిని చేసి వివిధ పత్రాలతో పూజించి మళ్లీ చెరువులో నిమజ్జనం చేయడం వలన చెరువు పూడిక తీసి మరియు శుభ్రపరచినట్టు అవుతుంది అనే విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్,కరస్పాండెంట్ రజనీ దేవి,ప్రిన్సిపల్ విజయ్,గాయత్రి విద్యానికేతన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## రాజీ మార్గమే రాజ మార్గం లోక్ అదాలత్ లతో సమ న్యాయం- జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) : రాజీ మార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్ లతో ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు.శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఇరు వర్గాలు రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.ఇరువర్గాలు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు.ఈ లోక్ అదాలత్ లో పలు క్రిమినల్ కేసులు,కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు,చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి దాదాపు 1210 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోద్నాల రవీందర్, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ,సంయుక్త కార్యదర్శి గుడ్ల వెంకటేష్ లతో పాటు పలువురు న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### మేధావుల సదస్సులో వక్తలు



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 12 జనంసాక్షి )** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం రోజున జ్యోతి నగర్‌లోని ఎం బ్యాంకెట్ హాల్‌లో తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచనం- జాతీయ వాదుల పాత్ర పై మేధావుల సమావేశం నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మేధావులు, వక్తలు మాట్లాడుతూ.. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించిన తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్రం రాలేదన్నారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానం నిజాం కబంధహస్తాల్లో బందీ అయ్యిందని , నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాల నుండి తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన చారిత్రక దినం సెప్టెంబర్ 17 అని గుర్తుచేశారు. నాటి రాచరిక పాలనలో ప్రజలు అనుభవించిన యాతనలను, అణచివేతలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశ ప్రథమ హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' చారిత్రక విజయం సాధించడం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని స్పష్టం చేశారు.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను, నాటి విమోచన ఉద్యమ వాస్తవాలను మరుగున పడేసేలా కొందరు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని వక్తలు మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా గత పాలకులు ఈ చారిత్రక దినాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడారని విమర్శించారు. తెలంగాణ సమాజం సాధించుకున్న స్వేచ్ఛా స్ఫూర్తిని, త్యాగాల చరిత్రను భావితరాలకు, నేటి యువతకు అందించాల్సిన బాధ్యత మేధావులపై, విద్యావేత్తలపై ఉందని అభిప్రాయపడ్డారు. విమోచన దినోత్సవ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ప్రతి ఏటా ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17న ప్రతి గ్రామస్థాయిలో, వార్డుల్లో జాతీయ జెండాలు ఎగురవేసి, విమోచన యోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పోరాట చరిత్రను ప్రతి ఇంటికి తీసుకువెళ్లేందుకు యువత, మేధావులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గుజ్జ శ్రీనివాసరావు, బిజెపి నాయకులు, కార్యకర్తల లతో పాటు నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మేధావులు, విద్యావేత్తలు, సామాజిక విశ్లేషకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) :** కరీంనగర్ టౌన్ 1 పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడు పైడిపాల వెంకటేశ్వర్లు ఏ వెంకటేష్‌కు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. నిందితుడిపై రూ. 1,000 (వెయ్యి రూపాయల ) జరిమానా కూడా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.కేసు వివరాల ప్రకారం. 29 -జూన్ -2023న కరీంనగర్‌లోని క్రిస్టల్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నం. 203లో గుండా సరితను నిందితుడు హత్య చేశాడు. మృతురాలితో నిందితుడికి సన్నిహిత సంబంధం ఉండగా, ఆమె వాట్సాప్ సంభాషణలు మరియు డబ్బు వ్యవహారాలపై అనుమానంతో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో నిందితుడు సరితను పట్టుకుని గోడకు తల, ముఖం బలంగా కొట్టడంతో పాటు చున్నీతో గొంతు బిగించి, గొంతుపై కాలు పెట్టి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం మృతురాలి మొబైల్ ఫోన్, బ్యాంక్ కార్డులు, పత్రాలు, చెక్‌బుక్‌లను తీసుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 90,000 తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. మృతురాలి ఫోన్ నుంచే వాట్సాప్ సందేశాలు పంపి ఆమె సజీవంగా ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశాడు.పోలీసులు నిందితుడిని 3జులై 2023న అరెస్టు చేసి, రక్తపు మరకలున్న దుస్తులతో పాటు ఇతర కీలక వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్, వేలిముద్రల ఆధారాలతో పాటు పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు, రూ. 1,000 జరిమానా విధించింది. 2026 సంవత్సరంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇది 22వ కన్విక్షన్ కావడం విశేషం.ఏసీపీ సీసీఆర్బి శ్రీనివాస్ జి పర్యవేక్షణలో, కేసు దర్యాప్తు అధికారి ఎం. రవి కుమార్, అప్పటి కరీంనగర్-1 టౌన్ ఇన్‌స్పెక్టర్, (స్ హెచ్ ఓ) కె. రామ్ చందర్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. ప్రతాప్, కోర్టు డ్యూటీ అధికారులు ఎస్.డి. సర్వర్ అలీ, ఎం. సతయ్య తదితరులు కేసు దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలో కీలకంగా వ్యవహరించినందుకు సీపీ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

## పండుగలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల శుభ్రత పనులు

### జానకంపేట్‌లో ట్రాక్టర్, జేసీబీతో పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు



**ఎడపల్లి, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో రాబోయే వినాయక చవితి, నవరాత్రి పండుగలను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో రోడ్డు శుభ్రత పనులు చేపట్టారు. గ్రామంలోని చుట్టూ రోడ్డుపై పెరిగిన పిచ్చి మొక్కలతో పాటు రాళ్లు, చెత్తాచెదారం తదితరాలను ట్రాక్టర్, జేసీబీ సహాయంతో తొలగించి రోడ్డును శుభ్రం చేశారు. పండుగల సందర్భంగా గ్రామంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే అవకాశం ఉన్నందున ముందస్తుగా రోడ్లను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉంచేందుకు ఈ పనులు చేపట్టినట్లు గ్రామ ఉపసర్పంచ్ నీలం కృష్ణ, 4వ వార్డు సభ్యుడు మురళీ తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ నీలం కృష్ణ మాట్లాడుతూ, గ్రామంలో పండుగలు ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేలా అవసరమైన ఏర్పాట్లపై పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రోడ్లపై పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, రాళ్లు ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే వాటిని తొలగిస్తున్నామని చెప్పారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థులు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. గ్రామస్థుల సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి జానకంపేట్‌ను మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం 4వ వార్డు సభ్యుడు మురళీ మాట్లాడుతూ.. వినాయక చవితి, నవరాత్రి పండుగల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొననున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లను శుభ్రం చేస్తున్నామని అన్నారు. పండుగల సమయంలో ప్రజలు, యువత, భక్తులు రోడ్లపై రాకపోకలు సాగించేటప్పుడు ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీ పాలకవర్గం చేపడుతున్న పారిశుధ్య, అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామస్థులు సహకరించాలని, రోడ్లపై చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు సభ్యుడు క్రాంతి కుమార్, గ్రామ యువకులు పేరక రవి, చిలుక ప్రవీణ్, బొక్కెన శ్రీనివాస్, ప్రదీప్ గౌడ్, చేపూరి శ్రీనివాస్, పిట్ల రాము, సుంకరి నవీన్‌తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ఆధ్వర్యంలో

# టీచర్స్ డే వేడుకలు

**బోధన్, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణం సరస్వతీ నగర్ లోని విజేత జూనియర్ కళాశాలలో శనివారం లైన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ ఎండి 320 జీఎంటి లయన్ పోలవరపు బసవేశ్వర రావు హాజరై మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు ఎక్కడైతే ప్రకృతి విపత్తులు సంభవిస్తాయో వారికి త్వరితగతిన ఇంటర్నేషనల్ సంస్థ నిధులను సమకూర్చి వారికి తోడ్పడుతుందని సమాజానికి విశిష్ట కృషి చేస్తున్నటువంటి వారిని సన్మాన కార్యక్రమాల ద్వారా సమాజానికి తోడ్పాటును అందిస్తుందన్నారు. అందులో భాగంగానే గురుపూజోత్సవ కార్యక్రమాలు ఇండియా మొత్తం సెలబ్రేట్ చేస్తుందని ఆయన తెలియజేశారు.మరొక విశిష్ట అతిథి ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ లక్ష్మి బసవేశ్వర్ మాట్లాడుతూ, గురువులకు సమాజంలో అత్యున్నత స్థానం ఉన్నదని వారిని గౌరవించిన వారికే సమాజంలో ఒక స్థాయి ఉంటుందని గురువుని ఎప్పటికీ మరిచిపోరాదని ఆమె తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి నాగయ్య మాట్లాడుతూ, సమాజంలో లైన్స్ సేవలను కొనియాడుతూ, గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గురువులను పాత రోజులలో కాకుండా కొత్తగా డిజిటల్ యుగములో వచ్చినటువంటి పద్ధతులను నేర్చుకుంటూ సోషల్ మీడియా మరియు గ్యాడ్జెట్స్ ఉపయోగించుకుంటూ పిల్లలకు విద్యాబోధన చేయాలని, పిల్లల్లో ఉన్నటువంటి చెడు అలవాట్లను రూపుమాపాల్సిన అవసరం గురువులకు ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు గడ్డం సాయిలు, సుధారాణి ,సునీత, సాయిరాం, పద్మ, ప్రీతి, గవర్నమెంట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి , శ్రీకాంత్ గౌడ్, భవిత, అనిత, నయాముద్దీన్ ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను మొత్తం 11 మందిని గురువులను సన్మానించడం జరిగిందని అధ్యక్షులు దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ శంకర్ విశ్రాంత ఉపాధ్యాయుడు జి ఈ టి పల్లెంపాటి శ్రీధర్, జీఎస్టి లయన్ శ్యామ్ సుందర్ పహాడే, రీజియన్ చైర్మన్ రంగారావు, జోన్ చైర్మన్ జెరూష, సెక్రటరీ రమణారెడ్డి, ట్రెజరర్ భగవాన్ కైలాసప్ప, సాంబిరెడ్డి, గాంధీ, సత్యనారాయణ, సురేష్, మిద్దెల రాజు, ముక్కామల వెంకటేశ్వర్‌రావు, సత్యం, గోపి తదితరులు హాజరు కాగా ఈ కార్యక్రమానికి మాస్టర్ ఆఫ్ సెర్మనీ గా శంకరమంచి కృష్ణమోహన్ వ్యవహరించారు.

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### - అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య - ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్



సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) : మున్సిపల్ పరిధిలోని పూసాల లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు,మత్స్యకారుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా చీకట్ల నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా,డైరెక్టర్ లుగా కొలిపాక రమేష్,చీకట్ల సారయ్య,చొప్పరి శ్రీనివాస్,ఉస్తేం శంకరయ్య, కంకణాల ప్రభాకర్,బొజ్జ రమేష్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి,మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్,మాజీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం,మాజీ సంఘం ప్రెసిడెంట్,సంఘం వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్,ఉస్తేం రవి,మాజీ ఎంపీటీసీ,కంకణాల ఆశాలు,చొప్పరి సుమన్ చీకట్ల రాజయ్య,ఉస్తేం శ్రీనివాస్,కంకణాల తిరుపతి,సంఘ సభ్యులు,మత్స్యకారులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## అర్జీ-2 జీఎం చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి రామగుండం-2 (అర్జీ-2) ఏరియా ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీ-2 జీఎం చేతుల మీదుగా ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. వినాయక చవితిని పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తరపున ఉద్యోగులందరికీ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు, నదులు కలుషితమై జలచరాలకు ముప్పు వాటిల్లు తోందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ప్రాచీన సంప్రదాయాన్ని గౌరవిస్తూ మట్టి వినాయకుడినే పూజిం చాలని పిలుపునిచ్చారు. "మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ శ్రీ గంధం సాంబశివరావు, ఏజీఎం ఐఈడీ శ్రీ చంద్రశేఖర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీ సునీల్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



**ప్రజలకు విజ్ఞప్తి**

"మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో నగర, గ్రామ ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించాలని సింగరేణి యాజమాన్యం కోరింది. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది.




# డీజే వద్దు.. బాజా ముద్దు

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదు

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 12:**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని 2 టౌన్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే వినియోగించాలని, మైక్ సిస్టమ్‌ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగిస్తే సంబంధిత డీజే ఆపరేటర్లు, యజమానులు, మండప నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు, యజమానులను బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని, అదే సమయంలో పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు కోరారు. "డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందుదాం" అని ఆయన ఆకాంక్షించారు.



# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

## సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు

**రామగిరి జనంసాక్షి :**
ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రధాన లక్ష్యమని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు తెలిపారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటరు వివరాల్లో తేడాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలు, ధ్రువపత్రాలను సమర్పించి వివరాలను సరి చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. ఇంటి పేరు, ఓటరు పేరు, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలను సమర్పించి వివరాలను సరి చేసుకోవాలని సూచించారు. గ్రామసభలో ఓటర్లు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఓటరు వివరాల సవరణ, అవసరమైన ధ్రువపత్రాలు, హియరింగ్ ప్రక్రియ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఒద్యారం గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం

**గంగాధర, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
మండలంలోని ఒద్యారం గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించబడిందని గంగాధర ఎస్ఐ బి వంశీకృష్ణ తెలిపారు



మృతుడి వయస్సు సుమారుగా 40 సంవత్సరాలు ఉంటుందని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని మృతుడి వివరాలు మరియు ఆచూకీ కోసం విచారణ చేపట్టి మృతుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని మృతుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు లేదా తమ కుటుంబ సభ్యులు బంధువులు ఎవరైనా కనిపించకుండా పోయినట్లయితే గంగాధర పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని లేదా సెల్ నెంబర్ కు 8712670768 సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

# జిల్లా స్థాయి ఆటలపోటీలకు ఎంపిక

**గంగాధర సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్. ఆటల పోటీలకువిద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి ఆటలపోటీలకు మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు వివిధ ఆటల పోటీలలో ఎంపిక చేయబడ్డారనీ ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్ కుమార్ తెలిపారు. అందులో సీనియర్ కబడ్డీ క్రీడాకారులుగా ఆర్ సాయి చరణ్ జి హరికృష్ణ ఎం కృష్ణ ఎల్ రేవంత్ జూనియర్స్ విభాగంలో ఎం రఘు ఎం హర్షిత్ నివాస్ సాత్విక్ మరియు వాలీబాల్ పోటీలకు సీనియర్స్ విభాగంలో పి సంజయ్ జి విష్ణు ఎం ఆదిత్య మరియు జూనియర్ విభాగంలో ఎం రఘు శివకుమార్ కోకో విభాగంలో సీనియర్లో బి రణధీర్ అక్షయ్ విజయ్ కుమార్ పి శ్రీ చరణ్ ఎస్ రాకేష్ మరియు జూనియర్ విభాగంలో కోకో దీక్షిత్ ఈ జస్వంత్ అభిషేక్ వంశీకృష్ణ బి రాజేష్ ఎం జశ్వంత్ ఎంపిక చేయబడ్డారు పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు రాకేష్ ఆధ్వర్యంలో వీరు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎన్నిక చేయడం జరిగింది. దానికి గాను ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు ఆటలు క్రీడలు ఎంతగానో వారి యొక్క మానసిక మరియు శరీరక లాభాలు కలుతాయని విద్యలో రాణించడానికి ఉత్సాహం చూపిస్తారని కాబట్టి క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని మరియు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



# వితంతువులకు ఆపన్నహస్తం

**రామడుగు(జనంసాక్షి):**
రామడుగు గ్రామానికి చెందిన రేవతి, భారతమ్మలు భర్తలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తోట సత్యం దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఇద్దరికీ ప్రతి నెల రూ.1500 విలువైన కిరాణా సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సహాయాన్ని శేఖర్ , శ్రీనివాస్‌ల ద్వారా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవతి, భారతమ్మలు తోట సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.



# విత్తన గణపతులు పంపిణీ

**గంగాధర సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ పంపించిన విత్తన గణపతులను శనివారం గంగాధర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మేచినేని నవీన్ రావుకు నిర్వాహకులు అందజేశారు. వినాయక చవితి సందర్భంగా మట్టి, విత్తనాలతో తయారు చేసిన గణపతి ప్రతిమలను పూజ అనంతరం నాటడం ద్వారా మొక్కలను పెంచవచ్చని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి, ప్రకృతి సంరక్షణను కలిపే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని అన్నారు ప్రతి ఒక్కరూ విత్తన గణపతులను ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్ ఎడ్ల అనిల్ మనోహర్ చందు వేణు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ

**ముస్తాబాద్ సెప్టెంబర్ 12( జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం రామిరెడ్డి పల్లె గ్రామ సర్పంచ్ లక్ష్మి వెంకట్రావు చేతులమీద యాపకాయల సంపత్ సిఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సంఘం ఎల్లయ్య, రమేష్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎల్లారెడ్డిలో ముదిరాజ్‌ల అసంతృప్తి.. గుర్తింపు ఏదీ?

**○జనాభాలో బలమైనా.. రాజకీయ ప్రాతినిధ్యంలో వెనుకబాటేనా?**

**○కీలక పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ముదిరాజ్‌లకు చోటెప్పుడు?**

**○జిల్లా అధ్యక్షుడు డా. బట్టు విట్టల్ ముదిరాజ్**



**ఎల్లారెడ్డి సెప్టెంబర్ 12 జనంసాక్షి :**
ఓట్ల సమయంలో ముదిరాజ్‌లు గుర్తొస్తారు.. పదవులు పంచే సమయంలో మాత్రం ఎందుకు కనిపించరు? అంటూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డా. బట్టు విఠల్ ముదిరాజ్ ప్రశ్నించారు. శనివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గంలో రాజకీయ అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. జనాభా పరంగా బలమైన సామాజిక వర్గంగా ఉన్నప్పటికీ.. రాజకీయంగా తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా పరంగా బలమైన సామాజిక వర్గంగా ఉన్న ముదిరాజ్‌లకు రాజకీయంగా ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీరుపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వాలు మారినా.. నాయకులు మారినా.. ముదిరాజ్ సామాజిక వర్గానికి దక్కాల్సిన కీలక పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల విషయంలో మాత్రం పరిస్థితి ఎందుకు మారడం లేదని నిలదీశారు. ఎన్నికలు సమీపించినప్పుడు ఓటు బ్యాంకుగా ప్రాధాన్యం ఇస్తున్నట్లు నటిస్తూ.. ఎన్నికలు ముగిసిన తర్వాత అదే స్థాయిలో రాజకీయ అవకాశాలు, నిర్ణయాత్మక బాధ్యతలు దక్కడం లేదని పేర్కొన్నారు. కొందరికి అరకొర చిన్నపాటి పార్టీ పదవులు ఇచ్చి వారిని ముందుకు చూపించడం ద్వారా మొత్తం సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం లభించినట్లు భావించకూడదని డా. బట్టు విఠల్ ముదిరాజ్ విమర్శించారు. ముదిరాజ్ నాయకత్వాన్ని విస్తృతంగా ప్రోత్సహించి, కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ముదిరాజ్ జాతి తగిన తీరులో గుణపాఠం చెప్పాలని ఇటీవల జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.

**పదవులు దయతో కాదు.. ప్రాతినిధ్యం హక్కుగా కావాలి!**

ముదిరాజ్ జాతి నాయకులు, ముఖ్యంగా యువత ఇకనైనా తమ సామాజిక వర్గానికి సంబంధించిన రాజకీయ ప్రాతినిధ్యంపై గట్టిగా, వ్యూహాత్మకంగా స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. పదవుల కోసం అడుగులకు మడుగులొత్తే ధోరణికి స్వస్తి పలికి.. తమ సామాజిక, రాజకీయ వాటాగా రావాల్సిన ప్రాతినిధ్యంపై అధికార పార్టీ నేతలతో చర్చించడం లేదా ప్రశ్నించే చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. సరైన గుర్తింపు లేని చోట బానిసలుగా కొనసాగడం ముదిరాజ్ జాతి నాయకుల రక్తంలో లేదని.. సరైన సమయంలో సరైన సమాధానం ఇవ్వడం తమ జాతికి తెలుసని ఆయన స్పష్టం చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గంలో ఐక్యత, సమన్వయం పెరిగితే తమ రాజకీయ ప్రాధాన్యంపై మరింత విస్తృతమైన చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో కనిపించే ఓటు బ్యాంకుగా కాకుండా.. పార్టీ వ్యవస్థలో, పాలనా వ్యవస్థలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలో తగిన ప్రాతినిధ్యం ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

**ఫామ్‌హౌస్ కేంద్రంగా ముఖ్య నాయకుల భేటీ!**

ఇటీవల ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం జరిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఎల్లారెడ్డి, జుక్కల్, కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో మండలాల వారీగా లెక్కలు తీసిన ముదిరాజ్ జాతి జనాభా.. ఎల్లారెడ్డి, జుక్కల్, కామారెడ్డి నియోజకవర్గాల గెలుపును నిర్ణయించే మెజార్టీ ఓట్లు ముదిరాజ్ జాతిలో ఉన్నాయని సమావేశంలో చర్చించామన్నారు. అయితే పదవుల పంపిణీ, పార్టీ నామినేటెడ్ పోస్టుల విషయానికి వచ్చేసరికి తగిన గుర్తింపు లభించడం లేదని.. దీంతో అధికార పార్టీ నేతల్లో నిరాశ నెలకొందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే తమ జాతికి రావాల్సిన వాటా కోసం ప్రత్యక్షంగా జిల్లా నాయకత్వం రంగంలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలిసింది.

**రాజకీయ పార్టీలు, నేతలు ఆలోచించాల్సిన సమయం!**

ఇన్నేళ్ల రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ముదిరాజ్ సామాజిక వర్గానికి కీలకమైన పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ఒక్కటైనా అవకాశాలు దక్కకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఈ అంశాన్ని ఇంతటితో వదిలిపెట్టేది లేదని.. 'తాడో?పేడో' తేల్చుకోవాల్సిన బాధ్యత ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న ముదిరాజ్ నాయకులపై ఉందని డా. బట్టు విఠల్ స్పష్టం చేశారు. ముదిరాజ్‌లు అత్యధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో ఆ సామాజిక వర్గం నాయకులు, యువత, మహిళలు ఎన్నికల వేళ గుర్తొచ్చే సామాజిక వర్గం.. అధికార, పార్టీ పదవుల పంపిణీలో ఎందుకు నిర్లక్ష్యానికి గురవుతుందని ప్రశ్నించారు. కావాలనే రాజకీయ దురుద్దేశంతో ముదిరాజ్ జాతిని ఎదగకుండా చేస్తున్న నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు. 'మేమెంతో.. మాకంత' అనే ప్రశ్నకు రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్‌ల రాజకీయ ప్రాతినిధ్యంపై అన్ని రాజకీయ పార్టీలు పునరాలోచన చేయాలని కోరారు. ఈ అంశంపై త్వరలోనే నియోజకవర్గాల వారీగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా కార్యవర్గం తీర్మానించినట్లు తెలిపారు. ముదిరాజ్ సమాజానికి దిశానిర్దేశం చేసిన కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్, పండుగల సాయన్న ముదిరాజ్, కేవల్ కిషన్ ముదిరాజ్, నెల్లి లక్ష్మీనారాయణ ముదిరాజ్ వంటి ప్రముఖుల ప్రస్థానం, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని 'మేమెంతో.. మాకంత' అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ జాతి నాయకులు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన అవకాశాల నుంచి స్ఫూర్తి పొంది విద్య, ఉద్యోగం, సామాజిక చైతన్యం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు.

**ముదిరాజ్‌ల రాజకీయ ప్రాతినిధ్యంపై మార్పు అనివార్యం!**

ఈ తంతు ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల వేళ ముదిరాజ్ సామాజిక వర్గం రాజకీయ ప్రాతినిధ్యంపై మరింత విస్తృతమైన చర్చ జరిగే అవకాశం ఉందని డా. బట్టు విట్టల్ అన్నారు. ఇప్పటివరకు జరిగిన రాజకీయ పరిణామాలను సమీక్షించుకుని.. భవిష్యత్తులో తమ వర్గానికి తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించే అంశాన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఇకనైనా మేల్కొలుపు రావాలి. మన సమస్యలపై మనమే ప్రశ్నించుకోవాలి. సామాజిక ప్రాతినిధ్యం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించి.. హక్కుల కోసం కృషి చేయాలి. ఓట్ల సమయంలో మాత్రమే కాకుండా.. రాజకీయ నిర్ణయాల్లోనూ ముదిరాజ్ సమాజానికి తగిన ప్రాతినిధ్యం ఉండాలని డా. బట్టు విట్టల్ ముదిరాజ్ పేర్కొన్నారు.



# అశోక్‌నగర్‌లో తీరిన తాగునీటి కష్టాలు

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 12, ( జనంసాక్షి)**
నగరంలోని 54వ డివిజన్ అశోక్‌నగర్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల కోసం ఏర్పాటు చేసిన నూతన బోరును శనివారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. కాలనీలో నీటి ఎద్దడిని గుర్తించిన 54వ డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకుని బోరు వేయించారు. నీటి సరఫరాకు అవసరమైన విద్యుత్ మీటర్‌ను సైతం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, తాగునీటి సమస్యలను పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యకు బోరు ఏర్పాటుతో పరిష్కారం లభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ ఉమారాణి వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, రమేష్, అరుణ్, శ్రీనివాస్, గండి గణేష్ తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చిన కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్

## కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ కు వాహనదారుల అభినందనలు

**గన్నేరువరం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ నుండి గన్నేరువరం వరకు ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలకు కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడ్ల శ్రీనివాస్ దాతల సహకారంతో మట్టీతో పూడ్చి శనివారం మరమ్మతులు చేశారు. ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను దృష్టిలో పెట్టుకొని, వారి ఇబ్బందులను తాత్కాలికంగా తగ్గించాలనే ఉద్దేశంతో మానకొండూర్ నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ వారు తెలిపారు. గుంతలతో వాహనదాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. గమనించిన కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ వారు దాతలు ఎడ్ల శ్రీనివాస్,జంగపల్లి సర్పంచ్ తాడూరి కరుణ వెంకట రమణ రెడ్డి సహాయంతో మట్టితో గుంతలు పూడ్చారు. కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ ని వాహనదారులు అభినందనలు తెలిపారు.





# ముందుగా అందరికీ వినాయక చవితి ముందస్తు శుభాకాంక్షలు..

**ధర్మపురి జగిత్యాల జిల్లా సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలోని 2వ డివిజన్ లో గత 5 సం" ల నుంచి ధర్మపురి బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో డివిజన్ ప్రజల కోసం ఉచిత మట్టి గణపతి విగ్రహాల ప్రతి ఇంటింటా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ..వినాయక చవితి అంటే మనందరికీ భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మికతతో కూడిన పండుగ. కానీ అదే సమయంలో మన పర్యావరణాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందుకే మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే మంచి ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా, సహజంగా కరిగిపోయే మట్టి గణపతులను ప్రతి కుటుంబం ప్రోత్సహించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతంగా, మన సంస్కృతి–సంప్రదాయాలను గౌరవిస్తూ, ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమం. ప్రతి ఇంటా మట్టి గణపతిప్రతి మనసులో వినాయకుడి ఆశీస్సులు మన పండుగ పవిత్రంగా మన పర్యావరణం పరిశుభ్రంగా ఉండాలి. 2వ డివిజన్ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి గణపతులను తీసుకెళ్లాలని కోరుతున్నాను. "మట్టి గణపతిని పూజిద్దాం మన నీటిని, మన ప్రకృతిని కాపాడుదాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలని మాట్లాడడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్ ,జిల్లా ఎండోమెంట్ కో కన్వీనర్ కలకోట రాజు, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, కోడుగంటి కిరణ్, సోమిశెట్టి శివ సాయి, కాసారపు వెంకటేష్, నక్క అక్షిత్, సోషల్ మీడియా ఇన్చార్జ్ కాసెట్టి హరీష్, మరియు వాడ సభ్యులు పాల్గొన్నారు.





# నేటి నుంచి జండా బాలాజీ జాతర

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనంసాక్షి:**
కలియుగ దైవమైన గోవిందా శ్రీ శ్రీనివాస గోవిందా భక్తవత్సల గోవిందా వడ్డీ కాసుల వాడా గోవిందా అంటూ భక్తులు శ్రీమన్నారాయణ వేడుకుంటూ
దర్శించుకున్న అంతనే అండగా నిలిచే స్వామి జండా బాలాజీ వెంకటేశ్వర స్వామి. జండా బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు సెప్టెంబర్ 12 వ తేదీన శనివారం ప్రారంభమై 26వ తేదీ శనివారంతో ముగియనున్నాయి. మహారాష్ట్రీయులు ఎంతో భక్తిగా పిలుచుకొనే బాలాజీ ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా భాద్రపద మాసం ప్రారంభమైన ఉత్సవాలు పౌర్ణమి వరకు సాగుతాయి., మొదటి రోజున వంశపారంపర్య ఆర్చకులు అజయ్ సాంగ్ వాయి ఇంటి వద్ద పూజలు నిర్వహించారు. . నగరంలో వివిధ వీధుల్లో తిరిగి జెండా అర్ధరాత్రి స్థానిక జెండా గల్లి లో గల జండా బాలాజీ ఆలయానికి చేరుకుంది, ఆలయంలో ప్రతిష్టించిన జెండాకు పది రోజులపాటు భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు . ఒకప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్ళలేని భక్తులుజెండా ని దర్శించు కున్నంత లోనే శ్రీనివాసుని సంపూర్ణ కటాక్షాలతో మన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. భక్తులకు ఆభయ హస్తాన్ని ఆందించిన జెండా బాలాజీ శ్రీనివాసుని దర్శించుకోవడానికి జిల్లా ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల భక్తులకు ఇలవేల్పుగా నిలిచారు. అధిక సంఖ్యలో ఊరేగింపులో భక్తులు పాల్గొననున్నారు ఆలయ అర్చకులచే, పండితులచే స్వామి వారి ఉత్పవాలు నిర్వహిస్తారు, భక్తులు జండా బాలాజీ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయరామరావు తెలిపారు.జండా జాలాజీ ఉత్పవాల కు ఎంతో ప్రాధాన్యత ఉంది మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలో కందర్ గ్రామంలో సాంగ్ వాయి వంశస్థులు జెండా బాలాజీని కొలిచే వారు. తుకోజి అనే భక్తుడు ప్రతిసంవత్సరం తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి వెంకటేశ్వరుని దర్శించుకునే వాడు. ఒకసారి స్వామిజీ కలలోకనిపించి నా భక్తునకు ఉత్సవ విగ్రహాలు ఇచ్చి తిరుమల కొండ దాటించ మని ఆదేశించాడట హౌసా విగ్రహాలను తీసుకొని ఇంటికి దారి పట్టి వారం రోజుల అనంతరం నిజామాబాద్ లో రాత్రి విశ్రాంతికై నిలిచాడని ఆ రాత్రి స్వామి వారు స్వప్నంలో కనిపించి వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించమని చెప్పారనితెలుస్తోంది . అలా సాంగ్ వాయి పంశం వారు జెండా బాలాజీ ఉత్పవాలు నిర్వహిస్తారు.ఈ సంవత్సరం జెండా బాలాజీ ఉత్సవాలలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శివరాత్రి ఆంజనేయులు కోరారు.జండా బాలాజీ ఉత్పవాల ముగింపు సందర్భంగా జండా ఊరేగింపు ఉంటుందన్నారు స్వామివారి జండా ముందుండగా ఉత్సవ విగ్రహములు ఊరేగింపు

## తెలంగాణలోని ఇందూరులో ప్రత్యేకం

## అర్చకులు వేద పండితులచే ప్రత్యేక పూజలు



గా పూ లాంగ్ బ్రిడ్జి వరకు తరలి వెళ్ళి విశ్రాంతి విడిది చేయడంతో ఉత్సవ కార్యక్రమాలు ముగిస్తాను అని తెలిపారు భక్తులు జండా ఊరేగింపు లో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తపల్లి అజయ్ సాంగ్ వాయి కుటుంబ సభ్యులు జాలిగనీ గోపాల్, లవంగ ప్రమోద్ ఆలయ అర్చకులు నాగరాజు జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, మోర సాయిలు నర్సింగరావు భక్తులు తదితరులు పాల్గొంటారు.



# విద్యుత్ అంతరాయాలతో పంటలకు ముప్పు.. సరఫరా మెరుగుపర్చాలి

**నిజామాబాద్ సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
ఇందూర్ జిల్లాలో విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతూ జిల్లా అధ్యక్షులు దినేష్ అన్న ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఇందూర్ జిల్లాలో సుమారు 2.50 లక్షల వ్యవసాయ పంపుసెట్ల కింద 6 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పూర్తిగా సాగునీటి కోసం వ్యవసాయ విద్యుత్‌పై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. అయితే కొన్ని రోజులుగా రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు విద్యుత్ ఇస్తున్నప్పటికీ మధ్యలో ఎల్‌ఆర్, బ్రేక్‌డౌన్ తదితర కారణాలతో తరచూ కోతలు విధిస్తున్నారని తెలిపారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.
రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బేషరతుగా, ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన 12 గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎస్పీని కోరారు. వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# దేవునిపల్లిలో, అఖిలభారత,యాదవ మహాసభ నూతన కమిటీ ఎన్నిక

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :**
మండలంలోని దేవునిపల్లి గ్రామంలో అఖిల భారత యాదవ సంఘం నూతన కమిటీ సర్పంచ్ అట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో, ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అఖిల భారత యాదవ్ మహా సభ ఉపాధ్యక్షులు చిట్టవేన సధయ్య,సుల్తానాబాద్ మండల్ అధ్యక్షులు ఫకీర్ యాదవ్,ఉపాధ్యక్షులు అట్లశ్రీనువాస్ హాజరయ్యారు.అఖిల భారత యాదవ మహాసభ దేవునిపల్లి అధ్యక్షులు గా పోలవేణి గంగన్న ఉపాధ్యక్షులుగా అట్లరాయమల్లు ,ఉపాధ్యక్షులు పోలవేణి రామస్వామి,జనరల్ సెక్రెటరీ పోలవేణి అంజన్న,జనరల్ సెక్రెటరీ అట్ల రాజేశం,పోలవేణి కానుకయ్య,సెక్రెటరీ కొమ్మ హరీష్,ఆర్గనైజేషన్ సెక్రటరీ పోలవేణి సతీష్,ఆచార కార్యకర్త పోలవేణి శ్రీనివాస్,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పోలవేణి కానుకరాజు,పోలవేణి సతీష్,పోలవేణి రాజయ్య,అట్ల రాజయ్య,పోలవేణి మల్లేషం,అట్లపరమేష్,అట్ల రాజయ్య,అట్ల సది,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లాలో విషాదం..

## బైక్‌ను ఢీకొట్టిన లారీ

## లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు..

## భార్య దుర్మరణం, భర్తకు తీవ్రగాయాలు




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనంసాక్షి:**
రోడ్డు ప్రమాదం రూపంలో దంపతులపై విధి పగబట్టింది. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ రూపంలో మృత్యువు కబళించడంతో కళ్లముందే భార్య ప్రాణాలు కోల్పోగా, భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం చంద్రయన్‌పల్లి శివారులో శనివారం ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి బడా భీమ్‌గల్ వైపు దుమాల లింబాద్రి (45), ఆయన భార్య దుమాల సుజాత (35) దంపతులు మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అదే మార్గంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి వారి బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అదుపుతప్పి కిందపడిన సుజాతపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త లింబాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలు సుజాత బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన గృహిణి.సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇందల్వాయి పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. సుజాత మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గాయపడిన లింబాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# చిరుత కాలి ముద్రలు కనిపించాయంటూ కలకలం



**సిరికొండ సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
సిరికొండ మండలంలోని జగదంబ తండా పరిధిలో మహిపాల్ తండా సమీపంలో చిరుత కాలి ముద్రలు కనిపించాయంటూ స్థానికులు చెప్పడంతో గ్రామాల్లో కలకలం నెలకొంది. కాలి ముద్రలను గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుత సంచారానికి సంబంధించి ఆధారాలను పరిశీలిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ నర్సింగరావు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత సంచారంపై పూర్తి స్థాయిలో పరిశీలించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# మండల పరిషత్ భవనానికే భద్రత కరువు!

## చిన్నపాటి వర్షానికే కూలిన ప్రహరీ గోడ.. శిథిలావస్థలో పైకప్పు



**సిరికొండ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**
మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం నిర్వహణపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చిన్నపాటి వర్షానికే కార్యాలయ ప్రహరీ గోడ కూలి నేలమట్టం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మండల స్థాయిలో కీలకమైన ప్రభుత్వ కార్యాలయానికి రక్షణగా ఉండాల్సిన ప్రహరీ గోడే కూలిపోవడంతో భవనం భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**శిథిలావస్థలో భవనం పైకప్పు**
మండల పరిషత్ కార్యాలయ భవనం పైకప్పు కూడా చాలాకాలంగా శిథిలావస్థకు చేరుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పైకప్పు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించడంతో పాటు వివిధ పనుల కోసం ప్రతిరోజూ ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో భవనం పరిస్థితిపై అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

**అధికారుల కార్యాలయానికే ఈ పరిస్థితా?**
మండల అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించే మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనానికే సరైన నిర్వహణ లేక ఇలాంటి పరిస్థితి నెలకొంటే, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాల పరిస్థితి ఎలా ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల నిర్వహణపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలి**
ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలిపోయిన ప్రహరీ గోడను వెంటనే పునర్నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన భవనం పైకప్పును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. భవనం పూర్తిగా సురక్షితంగా ఉందో లేదో నిపుణులతో పరిశీలన చేయించి, అవసరమైన నిధులు మంజూరు చేసి పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



# 6 వారాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ 1784 కేసులు నమోదు

## రూపాయలు 1 కోటి 45 లక్షల 20 వేలు జరిమానా

## 124 మందికి వారం రోజులు జైలు శిక్ష విధించిన సంబంధిత కోర్టులు పోలీస్ కమిషనర్ వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్నిలా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 6 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 1784 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు,బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో హాజరు పర్చగా ఇందులో 124 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ 1 కోటి 45 లక్షల,20 వేలు జరిమానా విధించనైనదని,కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరుగుచున్నదని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని ఇందులో భాగముగా 02 నుండి 12 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 1784 కేసుల నమోదు చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ,వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోవాలని, డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడునని,మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదని,మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడునని ,అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదని తెలిపారు.ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడునని ,మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి




పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడునని ప్రజలు యువకులు ఇట్టి విషయాన్ని గ్రహించి పోలీసువారికి సహకరించాలని కోరారు.

### 12వ, వార్డులో ప్రత్యేక వైద్య శిబిరం

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని,12వ వార్డులో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి పలువురు నుంచి రక్త నమూనాలు సేకరించారు.. అనారోగ్యంతో ఉన్నవారిని పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు.డాక్టర్ షహీభాజ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎమ్మెల్ హెచ్ పి దివ్య డెంగ్యూ మలేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలు పాటించాలని వైద్య సిబ్బంది వార్డు ప్రజలకు సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి-రాకేష్,మాజీ వార్డు మెంబర్ అమిరిశెట్టి తిరుపతి,ఏఎన్ఎంలు రమాదేవి,వినోద ఆశావర్కర్లు



సుజాత,స్వరూప కోమల,సుగుణ అంగన్ వాడి టీచర్ శ్రీమతి అమిరిశెట్టి మేఘమాల,నయీమ్,దొడ్ల సందీప్ తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ముస్లిం సంతుష్టీకరణ కోసమే సెప్టెంబర్ 17 వేడుకలకు ప్రభుత్వం దూరం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనంసాక్షి: ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సెప్టెంబర్ 17



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఆరోపించారు.జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ అధికారిక వేడుకలు జరపాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి 'రేవంత్ ఉద్దీన్'లా ఉందని ఆయన విమర్శించారు. రజాకార్ల కాలం నాటి అకృత్యాలను, తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. నిర్మల్‌లో రామ్‌జీ గోండ్ సహా వెయ్యి మందిని ఉరితీయడం, వల్లాలలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన పది మంది బడిపిల్లలను హత్య చేయడం, గుండ్రంపల్లి బావిలో 200 మందిని ఊచకోత కోయడం వంటి దారుణాలను ప్రస్తావించారు. కొమురం భీమ్, దొడ్డి కొమరయ్యల త్యాగాలు, సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పం, 'ఆపరేషన్ పోలో' సైనిక చర్యల ఫలితంగానే తెలంగాణ విముక్తి పొంది భారతదేశంలో విలీనమైందని ఆయన తెలిపారు.రజాకార్లు, ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూటమి మరియు కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి పూర్తి విమోచన లభించాలని ఆయన పేర్కొన్నారు.సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలి, హైదరాబాద్‌లో సర్దార్ పటేల్ భారీ విగ్రహం ఏర్పాటు చేయాలి, ప్రపంచస్థాయి మ్యూజియం కూడ ఏర్పాటు చేయాలి, ప్రతి జిల్లాలో అమరుల స్మారక కేంద్రాలు నిర్మించాలి, భైరాన్‌పల్లి, పరకాల వంటి పోరాట గ్రామాల్లో స్మారక స్థూపాలు ఏర్పాటు చేయాలి, విమోచన పోరాట చరిత్రను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చాలి, పోరాట ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక 'టూరిజం సర్క్యూట్' రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, నాయకులు న్యాలం రాజు, పద్మరెడ్డి, బొబ్బిలి వేణుగోపాల్, పోతుల పురుషోత్తం, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దొంగలపై సర్కార్ సర్జికల్ స్ట్రైక్స్..

- ◆మిల్లర్ల మాయాజాలం బట్టబయలు!
- ◆విజిలెన్స్ కొరడాతో కటకటాల్లోకి కేటుగాళు
- ◆సివిల్ సప్లై అండదండలతో వేల కోట్ల ప్రజాధనం స్వాహా
- ◆తనిఖీలను 'దాడులు'గా చిత్రీకరిస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు..
- ◆కక్కించేదాకా తగ్గేదేలేదంటున్న సర్కార్‌తో ఇరకాటంలో పడ్డ మిల్లర్లు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 జనం సాక్షి:** నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో రైస్ మిల్లర్ల పేరిట సాగుతున్న దోపిడీ యదేచ్ఛగా సాగుతోంది రైతుల నుంచి వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ మిల్లర్లకు కేటాయిస్తూ శుద్ధి చేసిన బియ్యాన్ని సేకరించే ఈ ప్రక్రియ మిల్లర్ల పంట పండిస్తోంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గత ఐదేళ్లుగా దాదాపు ఎనిమిది వందల కోట్ల విలువ చేసే దాన్యం పక్కదారి పట్టినట్టు తెలుస్తోంది. అధికారులు ఈ దోపిడీపై పక్కాగా లెక్క తేల్చడంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2021 నుండి నమోదైన పలు కేసుల్లోనూ అధికారులు వ్యవహరించిన తీరు మరిన్ని అనుమానాలకు దారి తీస్తోంది. కేసులు నమోదైన మిల్లర్లకు తిరిగి ధాన్యం కేటాయించడం రికవరీలోను అధికారుల తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు తెరపైకి తెచ్చిన ఈ పథకం రైస్ మిల్లు ఇండస్ట్రీ రూపు రేఖలే పూర్తిగా మార్చేసింది. అప్పటివరకు నామమాత్రంగా నడిచే మిల్లుల స్థానంలో భారీ ఇండస్ట్రీలు వెలిశాయి. మరోవైపు ఈ విధానంలో లోపాలను గ్రహించిన వేలాదిమంది బడా బాబులు, ప్రజాప్రతినిధులు మిల్లర్ల అవతారం ఎత్తారు. కామారెడ్డి జిల్లాలో 264 రైస్ మిల్లులు ఉండగా వాటిలో 146 మిల్లులలో మిల్లింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ లోనూ 264 రైస్ మిల్లులు ఉండగా వాటిలో 40 కి పైగా మిల్లులు బోగస్ ఉన్నట్లు సమాచారం. ఒక మాజీ ప్రజా ప్రతినిధి బినామీ పేర్లతో రైస్ మిల్లులు తెరపైకి తెచ్చి 140 విలువ చేసే వరి ధాన్యం పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. మరో నియోజకవర్గంలోనూ ఖాళీ షెడ్లలో రైస్ మిల్లులు చూపించి సీఎంఆర్ రైస్ తంతు సాగించినట్లు తెలుస్తోంది. వరి ధాన్యం పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్న అక్రమార్కులు ఇతర రాష్ట్రాల నుండి చౌకగా వచ్చే బియ్యం ఎఫ్సిఐకి అప్పగించే దందా సాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిజామాబాద్ జిల్లాలో ఓ ఎమ్మెల్యే సాగించిన అక్రమ రైస్ మిల్లర్ల దందా పై ఆరోపణలు వచ్చాయి. అయితే అధికారులు అక్రమాలపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోయారు. కామారెడ్డి జిల్లాలో 2021- 22 ఖరీఫ్ లో 39 మిల్లర్లు బియ్యం అప్పగించడంలో విఫలం కాగా ఇద్దరు మిల్లర్ల పై మాత్రమే చర్యలు తీసుకున్నారు. 2022 లోను 37 మిల్లర్లు డిఫాల్టర్లుగా తేల్చగా కేవలం ఇద్దరిపైనే కేసులు నమోదు చేశారు. తిరిగి 23- 24 లోను ఏడుగురు మిల్లర్లు బియ్యం సరఫరా చేయలేకపోగా ముగ్గురిపై నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. కామారెడ్డి జిల్లాలో రెండు సిండికేట్ల దందాకు అధికారులే అండదండలు అందించినట్లు ఆరోపణలు వినిపించాయి. మిల్లింగ్ జరగని వాటికి కేసులు నమోదైన వారికి పెద్ద ఎత్తున వరి ధాన్యం అప్పగించడం విమర్శలకు దారితీసింది. నిజామాబాదులో గత నెలలో 6 మిల్లులు దాన్యం పక్కదారి పట్టినట్టు తేల్చారు. అయితే ధాన్యం విలువ తక్కువగా చూపినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో పలువురు మిల్లర్లకు అధికారులు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తూ అక్రమాలకు కారణం అవుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాలూరు, సాలూరు మిల్లర్ లు 2022 నుండి దాన్యం అప్పగించని మిల్లులపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కామారెడ్డిలో ఇద్దరు బడా



వ్యాపారులపై దాడుల్లోనూ అనేక కీలక పరిణామాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున కుదిరిన డీల్తో దాడులకు ఫుల్ స్టాప్ పడినట్లు చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే అధికారుల తీరు, ఈ ప్రక్రియలు, డొల్లతనం వల్ల వేలకోట్ల విలువ చేసే ప్రభుత్వ ధాన్యం పక్కదారి పడుతూ అక్రమార్కులకు వరంగా మారుతుంది. దాన్యం కేటాయింపు మొదలుకొని బియ్యం సేకరణ వరకు కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. వరి ధాన్యం రకం, ప్రాంతం ఆధారంగా పలువురికి మేలు చేయడం ,నాణ్యతలేని బియ్యాన్ని సేకరించి లబ్ధి పొందడం కోసం ప్రత్యేక విభాగం పని చేస్తున్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మిల్లింగ్ చేయని వాటికి పెద్ద ఎత్తున ధాన్యం కేటాయింపు చేయడంపై సైతం విమర్శలు, ఉన్న అధికారులను ఎదిరించి ఇబ్బంది పడలేక సర్దుకుపోయినట్లు తెలుస్తోంది. మొత్తానికి అక్రమ దందాకు అధికార వర్గాలు అండగా నిలుస్తూనే ఉన్నట్లు పౌరసరఫర శాఖలోను చర్చ జరుగుతుంది. ఈ మేరకు ఇటీవలే కామారెడ్డిలో డిఎస్ఓ కార్యాలయంలో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు విస్తూ పోయారు. పలువురు మిల్లర్లకు అధికారులు అండదండలు ఇవ్వడం వల్లే ధాన్యం యదేచ్ఛగా పక్కదారి పట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తానికి ధాన్యం కొనుగోలు మిల్లర్లకు కేటాయింపు బియ్యం సేకరణ తంతులు కోట్లాది రూపాయల అక్రమాలు యదేచ్ఛగా సాగుతున్నాయి.

ఎఫ్ సి ఐ కి సమయానికి బియ్యం సరఫరా చేయకపోవడం వలననే జరిమానాలు వడ్డీ కట్టమని ఎఫ్సీఐ అనడం జరుగుతుంది, కాబట్టి అడ్డగోలుగా మింగిన డబ్బులు ఇప్పుడు కట్టమని అనడంతో మిల్లర్లకు ఇబ్బందులు దుఃఖం కలుగుతుందని, కాబట్టి ఆ డబ్బులను మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని ముంచడానికి సిద్ధంగా ఉన్నామని దానిని కారణంగా చూపుతూ ధర్నాలు పేరుతో నాటకాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.కొందరు బడా రైస్ మిల్లర్లు డబ్బులు కట్టకుండా ఎగవేత చేయడం వలన చిన్న రైస్ మిల్లర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్పొరేట్ సంస్థలు వచ్చి బుడ్డ దుకాణాలు బంద్ అయినట్టు, హైపర్ మార్కెట్లు, సూపర్ మార్కెట్లు వచ్చి కిరాణా దుకాణాలు మూతపడినట్లు, బడా రైస్ మిల్లర్లు లాబీయింగుకు పాల్పడి ప్రభుత్వానికి డబ్బులు కట్టకపోవడంతో ప్రభుత్వాన్ని ముంచాలని ఇలాంటి ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బొంకూరి కైలాసం తప్పుడు ఆరోపణలు సహించేది లేదు

## - ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం హెచ్చరిక - పెద్దపల్లి ఏసిపి కి వినతి.. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



పెద్దపల్లి,సెప్టెంబర్ 12(జనంసాక్షి) : దళిత,బహుజన,అనగారిన వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధుపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని సంఘం జాతీయ,రాష్ట్ర నాయకులు తీవ్రంగా హెచ్చరించారు.అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న బొంకూరి కైలాసం అక్రమాల చిట్టాను ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతామని స్పష్టం చేశారు.శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు,మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, జిల్లా అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్‌లు పాల్గొని మాట్లాడుతూ 50 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘానికి రిజిస్ట్రేషన్ లేదంటూ బొంకూరి కైలాసం చేస్తూన్న ప్రచారం పచ్చి అబద్ధమని నాయకులు కొట్టిపారేశారు. తమ సంఘం 103/77 రిజిస్ట్రేషన్ నంబర్‌తో చట్టబద్ధంగా కొనసాగుతోందని స్పష్టం చేస్తూ, దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను విలేకరులకు చూపించారు. అలాగే, అంబేద్కర్ భవనం నిర్మాణం పేరుతో ఒక వ్యక్తి వద్ద రూ. 30 లక్షలు తీసుకున్నారనడంలో ఎలాంటి నిజం లేదని, ఆ భవనానికి సంబంధించిన రెండు ఒరిజినల్ డాక్యుమెంట్లు అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వద్ద భద్రంగా ఉన్నాయని వివరించారు. లీగల్ ప్రామాణికత కలిగిన సంఘంపై, నిస్వార్థంగా పనిచేస్తున్న బొంకూరి మధుపై లేనిపోని నిందలు వేస్తూ,పెద్దపల్లికి రావద్దంటూ బెదిరింపులకు గురిచేయడం కైలాసం కుట్రపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.గోదావరిఖని పట్టణంలోని ఓల్డ్ అశోక్ టాకీస్ వద్ద అడ్డకూలీగా, తాపీ మేస్త్రిగా జీవితాన్ని ప్రారంభించిన బొంకూరి కైలాసం, సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతోనే దళిత నాయకుడి అవతారమెత్తాడని నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మహనీయుల ఆశయ సాధన పేరుతో సంఘాన్ని అడ్డం పెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు పెట్టిస్తానని నమ్మబలికి గుండారం గ్రామానికి చెందిన పలువురు మహిళల నుండి డబ్బులు వసూలు చేశాడని, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుని ఇప్పటివరకు ఎంతో మంది వద్ద వసూళ్లకు పాల్పడిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలోనే ఆ చిట్టానంతా బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా,కైలాసం నడుపుతున్న సంఘానికి ఎలాంటి రాష్ట్ర లేదా జిల్లా కమిటీలు లేవని, కేవలం భయభ్రాంతులకు గురిచేసేందుకే ఆ పూటకు కొంతమందికి డబ్బులిచ్చి ప్రెస్ మీట్లలో కూర్చోబెట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు.సంఘం ప్రతిష్టకు భంగం కలిగిస్తూ,కావాలని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తున్న బొంకూరి కైలాసంపై పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు పెడతామని, లీగల్‌గా కూడా ముందుకు వెళ్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశం అనంతరం నాయకులు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. కైలాసంపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో, పోలీసులు అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, జిల్లా కో-కన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్,ఇంటిబిల్లి రవీంద్ర కుమార్, గొట్ట లింగయ్య,నక్క శంకర్, పొనుగంటి రాజనర్సు, బొచ్చు శంకర్,పొనుగంటి రాజలింగంలతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు కాంపల్లి జీవన్ కుమార్, బొల్లి నందయ్య,నిర్భట్ల రాజయ్య,బొసెల్లి మహేష్,కుక్క అశోక్,ఉప్పులేటి పవన్ కుమార్,ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### -అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య

### -ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :**
మున్సిపల్ పరిధిలోని పూసాల లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు, మత్స్యకారుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా చీకట్ల నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా,డైరెక్టర్ లు గా కొలిపాక రమేష్, చీకట్ల సారయ్య, చొప్పరి శ్రీనివాస్,ఉస్తేం శంకరయ్య,కంకణాల ప్రభాకర్, బొజ్జ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని,సంఘ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.మత్స్యకారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సంఘ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, మాజీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, మాజీ సంఘం ప్రెసిడెంట్, సంఘం వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్,ఉస్తేం రవి,మాజీ ఎంపీటీసీ,కంకణాల ఆశాలు,చొప్పరి సుమన్,చీకట్ల రాజయ్య,ఉస్తేం శ్రీనివాస్,కంకణాల తిరుపతి,సంఘ సభ్యులు,మత్స్యకారులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన సెస్ డైరెక్టర్ ఏఎంసి చైర్మన్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సినిమా టాకిస్ వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం సెస్ డైరెక్టర్ వరుస కృష్ణాహరి, షేక్ సబేరా బేగం గౌస్‌లు కలిసి ప్రారంభించారు, పోలీస్ స్టేషన్ ఆవరనలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కు విద్యుత్ భారం తగ్గిందని శ్రీరామ కృష్ణ సినిమా టాకీస్ వద్ద గల ట్రాన్సఫార్మర్ వలన ఈ ఏరియా పరిదిలోని గృహ వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య తీరినట్టేనని సెస్ డైరెక్టర్ వరస కృష్ణ హరి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచు ఎలగందుల నరసింహులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా ఆధ్యక్షులు తోట ఆగయ్య, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల ఆధ్యక్షులు దోమ్మాటి నరసయ్య, ఉప సర్పంచ్ బందారపు బాల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి కృష్ణ యాదవ్, వార్డు సభ్యులు అంతేర్పుల గోపాల్, అంగూరి ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షలు సద్ది లక్ష్మారెడ్డి, డైరెక్టర్ వెంకట రెడ్డి, నాయకులు నేవూరి సర్వయ్య, పద్మారెడ్డి, జగన్ రెడ్డి, బండారి బాల్ రెడ్డి, గుండాడి వెంకట్ రెడ్డి, గంట బుచ్చా గౌడ్, రాపెల్లి అంబదాస్. రఫీక్ దొనుకుల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి నియోజకవర్గంలో మరొక నూతన వ్యవసాయ మార్కెట్

## ఎలిగేడు మార్కెట్ చైర్మన్ గా పోట్యాల రమేష్ ఎన్నిక



**ఎలిగేడు,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :**
ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు సిఫారసు మేరకు పెద్దపల్లి నియోజకవర్గంలో నూతనంగా ఎలిగేడు వ్యవసాయ మార్కెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.నూతన ఎలిగేడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని నియమిస్తూ జీవో నంబర్ 570 ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఎలిగేడు నూతన వ్యవసాయ మార్కెట్ చైర్మన్గా పొట్యాల రమేష్,వైస్ చైర్మన్ గాకోరుకంటి వెంటకేశ్వర రావు, డైరెక్టర్లుగాచంద్రగిరి పర్శరాములు,కోరుకంటి సంపత్ రావు,పొన్నాల స్వామి,అమ్ముల శ్రీనివాస్,పూరేళ్ళ మల్లేశం,అప్పల హరీష్,గొడుగుల మహేందర్,డైరెక్టర్ కోడూరి రమేష్,ఏలేటి మల్లా రెడ్డి,మెచినేని ఆంజనేయ రావులు ఎన్నికయ్యారు.ఈ నూతన వ్యవసాయ మార్కెట్లో అనవాయితీగా స్థానిక సింగిల్ విండో చైర్మన్ ఎలిగేడు, స్థానిక గ్రామ సర్పంచ్(ఎలిగేడు), జిల్లా మార్కెటింగ్ అధికారి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లు పాలకవర్గంలో డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు.వీరందరూ తమ నియామకానికి వెన్నుదన్నుగా నిలిచి వారిని రాష్ట్ర వ్యవసాయ శాఖకు సిఫారసు చేసిన ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఎలిగేడు లో నూతన వ్యవసాయ మార్కెట్ ను ఏర్పాటు చేసినందుకు మండల ప్రజలు,రైతులు,రాష్ట ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు కి కృతజ్ఞతలు తెలిపారు.

## సుప్రీంకోర్టు మార్గదర్శకాలదంతో డీజేలకు అనుమతి లేదు..

## - పెద్దపల్లి డీసీపీ బి.రాంరెడ్డి..

గోదావరిఖని, జనంసాక్షి :
రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ బి.రామ్‌రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.డీజే శబ్దం ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా గుండె సంబంధిత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున డీజే వినియోగంపై నిషేధం అమల్లో ఉందన్నారు.కాబట్టి గణేష్ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జన శోభాయాత్రలో ఎవరూ డీజేలను వినియోగించరాదని సూచించారు.గోదావరిఖని ప్రజలు ఎల్లప్పుడూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తూ, పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తున్నారని డీసీపీ తెలిపారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చి గోదావరిఖనిలో నివసిస్తున్న ప్రజలు స్థానిక ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ఐకమత్యంతో జీవిస్తున్నారని, అందుకే గోదావరిఖనికి 'మినీ మాంచెస్టర్'గా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.అదే స్ఫూర్తితో గణేష్ నిమజ్జనాన్ని కూడా అందరూ కలిసి ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించాలని కోరారు.నిమజ్జన శోభాయాత్రను వీలైనంత త్వరగా ప్రారంభించి, మధ్యాహ్నం ప్రారంభిస్తే సాయంత్రం 5 లేదా 6 గంటలలోపు ప్రధాన చౌరస్తాకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రధాన చౌరస్తా నుంచి గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశానికి శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగించాలని తెలిపారు.డీజే నిషేధం కేవలం పోలీసుల ఆదేశం కాదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో భాగమని డీసీపీ స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పవిత్రమైన గణేష్ ఉత్సవాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఇబ్బందులు, నష్టాలు తెచ్చుకోకుండా భక్తి, భద్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించి,భవిష్యత్తులో అందరూ సంతోషంగా గుర్తుచేసుకునే విధంగా జరుపుకోవాలని డీసీపీ కోరారు.మండప నిర్వాహకులు పోలీసులు,ఉత్సవ కమిటీ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.





## తెలంగాణ స్టేజ్-2 ప్రాజెక్టులో సైట్ లెవలింగ్ పనులు ప్రారంభం..

### - కీలక మైలురాయిని అధిగమించిన ప్రాజెక్టు..

**గోదావరిఖని, జనంసాక్షి :**

ఎన్టీపీసీ-రామగుండం తెలంగాణ స్టేజ్-2 (3.800 మెగావాట్లు) ప్రాజెక్టుకు సంబంధించిన బీటీజీ ప్యాకేజీని మెస్సర్స్ బీహెచ్ఈఎల్ సంస్థకు కేటాయించారు.తెలంగాణ స్టేజ్-2 అభివృద్ధిలో భాగంగా ప్రధాన ప్లాంట్ సైట్ లెవలింగ్ పనులను ప్రారంభించేందుకు శనివారం 'సైట్ లెవలింగ్ పూజ' నిర్వహించారు.ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ సంస్థల సీనియర్ అధికారులతో పాటు ఈడీ (ఆర్ అండ్ టీ) సి.కె.సమంత సమక్షంలో ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.సైట్ లెవలింగ్ పనుల ప్రారంభం తెలంగాణ స్టేజ్-2 పురోగతిలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని అధికారులు తెలిపారు.ఇది తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో ఎన్టీపీసీకి ఉన్న నిబద్ధతను మరింత ముందుకు తీసుకువెళుతుందని అధికారులు పేర్కొన్నారు.

### క్రీడలతో ఆరోగ్యం, ఉత్సాహం

# ఉన్నత స్థాయికి ఎదగాలి

### లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం..

చెందిన ఉద్యోగ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.పోటీల ప్రారంభంతో క్రీడా ప్రాంగణంలో సందడి నెలకొంది.క్రీడాకారులు పోటీతత్వంతో తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.సింగరేణి సంస్థలో ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా ఉద్యోగుల్లో స్నేహభావం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వం మరింత పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.లాన్ టెన్నిస్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి జి. హనుమంతరావు, కోఆర్డినేటర్ గాండ్ల రాజయ్య, వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు.సింగరేణి ఉద్యోగుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ స్థాయి వరకు తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ క్రీడా పోటీలు ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి.



## 5వ తరగతి విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం..

**గోదావరిఖని, జనంసాక్షి :**

స్థానిక తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, రామగుండం బాలుర-1 పాఠశాలలో ఐదవ తరగతి నూతన విద్యార్థులకు రోజున ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ బహుకరించడం జరిగింది.ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవీ లక్ష్మీనరసయ్య( మోటివేషనల్ స్పీకర్ ),మహమ్మద్ ఇస్మాయిల్,ఆయేషాసిద్ధికి టెమ్రీస్ కౌన్సిలర్ అలాగే ప్రిన్సిపల్ డాక్టర్ గుల్బం శ్రీధర్ పాల్గొని విద్యార్థులకు అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థుల్లో స్నేహభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా ఆనందంగా పాలుపంచుకున్నారు.

# ఏఐటీయూసీ సింగరేణి యాజమాన్యంతో చేసుకున్న..

### - ఒప్పంద పత్రాలను బహిర్గతం చేయాలి..

### - డ్రైవర్స్ అండ్ ఈపీ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కట్కూరి..

గోదావరిఖని, జనంసాక్షి :

కేంద్ర కార్మిక శాఖ అధికారుల సమక్షంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ఇటీవల సింగరేణి యాజమాన్యంతో చేసుకున్న ఒప్పంద పత్రాలను బహిర్గతపరచాలని సింగరేణి డ్రైవర్స్ అండ్ ఈపీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కట్కూరి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.గోదావరిఖని ప్రెస్క్లబ్‌తో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.గుర్తింపు సంఘం ఇచ్చిన సమ్మె నోటీసుతో యాజమాన్యం దిగివచ్చిందని, ఈ నేపథ్యంలో చరిత్ర తిరగరాసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని ఏఐటీయూసీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.అదే నిజమైతే అగ్రిమెంట్ పత్రాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు.23 డిమాండ్లను సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు, ఒప్పంద పత్రాలను బయట పెట్టకపోవడంతో కార్మికులలో పలు అనుమానాలు చోటు చేసుకుంటున్నాయని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.ఇది కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే పరిగణిస్తున్నారని అన్నారు.వెహికల్ డ్రైవర్ల, అండ్ ఆపరేటర్ల సమస్యల పట్ల గుర్తింపు సంఘానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.సూటబుల్ జాబ్ సమస్యపై ఆర్ఎల్‌సీ సమక్షంలో 4ఏళ్ల క్రితం కమిటీ వేస్తామని



ప్రకటించి,నేటికీ ఆ కమిటీ నివేదిక ఎందుకు ప్రకటించలేదని,ఆ విషయంపై ఏఐటీయూసీ యాజమాన్యాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. ప్రమోషన్ పాలసీలో వన్ టైం మేజర్ డి నుండి సి గ్రేడ్‌కు ప్రమోషన్ ఇచ్చారని, తర్వాత ప్రమోషన్ల ఊసే ఎత్తడం లేదని వాపోయారు.సమ్మె చేయాల్సి వస్తే ఓపెన్ కాస్ట్ గనులే కీలకం కనుక ఆపరేటర్ల అవసరం గుర్తుకు వస్తుందన్నారు.కానీ వారి సమస్యలను మాత్రం ఏ కార్మిక సంఘం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.మెడికల్ ఇన్వాల్యువేషన్ ప్రక్రియ గతి తప్పిందని,సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతుందని అన్నారు.గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన దరిమిలా సింగరేణిలో వెంటనే గుర్తింపు ఎన్నికలు జరపాలని,లేకుంటే అర్హులైన అన్ని సంఘాలకు సమ ప్రాధాన్యత కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ శ్రీనివాస్‌రెడ్డి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు విజయ్‌మోహన్, ఉదయ్‌కుమార్, రాజమౌళి, కనకయ్య, అశోక్, రామ్‌మోహన్, రవీందర్ రెడ్డి, సాయిమణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం ఏరియా.1లో కబడ్డీ పోటీలు ప్రారంభం..



గోదావరిఖని, జనంసాక్షి:

రామగుండం ఏరియా-1 పరిధిలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూ పిఎస్ అండ్ జిఎ) ఆధ్వర్యంలో స్థానిక జవహర్ లాల్‌నెహ్రూ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు గురువారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జీడీకే ఓసీ-5 ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని,కరచాలనం చేస్తూ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్ మాట్లాడుతూ క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో, క్రమశిక్షణతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ క్రీడలకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, రామగుండం ఏరియా నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో, ముఖ్యంగా కోల్ ఇండియా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ఆర్.జి-1 పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ పిఎస్ అండ్ గౌరవ కార్యదర్శి జి. హనుమంతరావు, కోఆర్డినేటర్ గాండ్ల రాజయ్య, వివిధ గనుల క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సకల జనుల సమ్మె స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం..

### - టీబీజీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కెంగర్ల మల్లయ్య..

గోదావరిఖని, జనంసాక్షి :

సకల జనుల సమ్మె స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు ఆదివారం నుంచి ఉద్యమిస్తామని టీబీజీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కెంగర్ల మల్లయ్య అన్నారు.గోదావరిఖని ప్రెస్క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 13 నుండి సింగరేణిలో సకల జనుల సమ్మె మొదలైన రోజని అందుకే సకల జనుల సమ్మె స్ఫూర్తిని కొనసాగిద్దామన్నారు. కార్మికుల హక్కుల సాధనకై పోరాడుదాం అనే నినాదంతో రేపటి నుండి ప్రతి గనిపై, డిపార్ట్మెంట్‌లపై పోరాటాలను కొనసాగుస్తామని తెలిపారు.సింగరేణిలో అనేక సమ్మెలు జరిగాయని, కానీ అవన్నీ ఆర్థిక ప్రయోజనాల కోసం జరిగితే సకల జనుల సమ్మె మాత్రమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిందని అందుకే ఈ పోరాట స్ఫూర్తినీ నేటి తరం యువ కార్మికులకు తెలియజేస్తూ కార్మికుల హక్కుల సాధనకై పోరాటాలు చేద్దామని అన్నారు.సింగరేణిలో అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల సమస్య, సొంతింటి కల,ఇన్కమ్ టాక్స్



రద్దుపై పోరాడుతూనే మెడికల్ బోర్డులో అత్యధికంగా కార్మికులను ఆన్ ఫిట్ చేయాలని ఉద్యమిద్దామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఏస్ నాయకులు బొడ ఐలయ్య, ముదుగిరి మల్లేష్,నాగుల మోహన్‌రావు, చిగురుపల్లి మహేష్, రామగిరి విజయ భాస్కర్, లక్కాకుల శ్రీను, తాండ్ర సత్యనారాయణ, తాళ్ళపల్లి నర్సింహస్వామి, అల్లాడి శ్రీనివాస్, వేగుల నరేష్, జగతి రాజస్వామి, కోట శ్రీనివాస్, కోరుకొప్పుల శ్యామ్‌కుమార్, దాసరి శంకర్, మారుముళ్ళ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ హిత గణేశుడి ప్రతిమలు పంపిణీ..

**గోదావరిఖని, జనంసాక్షి :**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణహిత గణేశ చతుర్థి వేడుకలను ప్రోత్సహించేందుకు ఎన్టిపిసి-రామగుండం చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా టౌన్‌షిప్ నివాసితులకు సహజ మట్టితో తయారు చేసిన గణేశ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజి పిసిబి) రామగుండం ప్రాంతీయ కార్యాలయం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా సహజ మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.అంతేకాకుండా నదులు, చెరువులు, ఇతర జలవనరులతో పాటు జలచర జీవావరణ వ్యవస్థల పరిరక్షణకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.టౌన్‌షిప్ నివాసితుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం,పండుగలను పర్యావరణహితంగా నిర్వహించేలా ప్రోత్సహించడం కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.సుస్థిర జీవన విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎన్టిపిసి రామగుండం కృషి చేస్తోందన్నారు.